
కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ(e) మాసపత్రిక



నవంబరు 2010

కొత్తపల్లి


తెలుగు పిల్లల ఈ (e) మాస పత్రిక

సంచిక:8 నవంబరు 2010 సంపుటి: 3

(http://kottapalli.in లోని e - సంచికకు పుస్తక రూపం)


ఈ సంచికలో. . . .

బొమ్మకు కథ రాయండి!





మోసానికి మోసం



ఈ మాసపు ముఖచిత్రం

"బాలల దినోత్సవం!"



బాలల దినోత్సవం

బడిలో బాలల దినోత్సవం జరుపుకుంటున్నారు.

వేదిక మీద వెనకగా ఉన్న ఫొటోలో చాచా నెహ్రూ నవ్వుతున్నాడు.

ఫొటోకి ముందు పది కుర్చీలున్నై. గ్రామంలోని ముఖ్యులు వచ్చి ఆ కుర్చీల్లో కూర్చుంటారు.

ఆ కుర్చీలముందు ఒక పెద్ద టేబుల్ ఉంది. దానిమీద మంచి రోజాపూల ప్లాస్టిక్ షీటు కప్పిఉంది. ఒక గాజు గ్లాసులోకొన్ని పూలు అందంగా అమర్చి ఉన్నై.

బడి అంతా పండుగ వాతావరణం నెలకొని ఉన్నది. క్రితం రోజున పట్నంలో కొనుక్కొచ్చి కట్టిన ప్లాస్టిక్ జెండాలు గాలికి ఊగుతూ వింతగా శబ్దం చేస్తున్నై.

చెప్పినట్లుగా ఎనిమిది గంటలకల్లా వచ్చేసి, తరగతుల వారీగా వరసల్లో కూర్చున్నారు పిల్లలందరూ- వేదికకు ఎదురుగా.

కార్యక్రమాలు నడిపే పెద్దలంతా అటూ ఇటూ తిరుగుతూ హడావిడి చేస్తున్నారు.

మైకులో దేశభక్తి గీతాలు- అవే తిప్పి తిప్పి వినిపిస్తున్నారు.

సమయం పదిగంటలైంది. తొమ్మిదికే రావలసిన జిల్లా స్థాయి అధికారి గారు ఇంకా రాలేదు. ప్రధానోపాధ్యాయులవారు హడావిడిగా అందరికీ ఫోన్లు చేస్తున్నారు.

పిల్లలు కొంచెం అసహనంగానే ఉన్నారు. డ్రిల్ సారుకు క్రమశిక్షణ ఎక్కువ. ఒక్క పురుగును కూడా బయటికి పోనివ్వటం లేదు.

ఎండ ఎక్కువైంది. పిల్లలకు దాహార్తి ఎక్కువైంది. కార్యక్రమం ఇంకా మొదలే కాలేదు. అధికారి గారు రావాలి, ఊరి పెద్దలు రావాలి, అందరూ పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడాలి, ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, అప్పుడు గానీ తినేందుకు ఏమీ ఇవ్వరు. ఆ తర్వాతే, ఇంటికెళ్లటం...

నీళ్ళ పంపు దగ్గర రద్దీ పెరిగింది. తొక్కిసలాట మొదలైంది. డ్రిల్ సారు వచ్చి అందర్నీ తరిమేశారు అక్కడినుండి.

కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రంగులు వేసుకున్న పిల్లల ముఖాలు వాడిపోయి ఉన్నై. ముఖాలమీద వాలే ఈగల్నీ, దోమల్నీ తోలుకోకుండా అలాగే భరిస్తున్నారు వాళ్ళు- మేకప్పులు పోతాయని.

వరసల్లో పిల్లలు చాలామంది కడుపులు బిగబట్టుకొని కూర్చున్నారు. లేచి వెళ్దామంటే డ్రిల్ సారు ఏమంటారో అని భయం. బడిలో ఎలాగూ టాయిలెట్లు లేవు. ఇప్పుడు దూరం వెళ్లి రావాలంటే కుదిరేట్లు లేదు..

పదకొండైంది. కార్యక్రమం ఇంకా మొదలు కాలేదు. అధికారి గారు రాలేదు. ఆకలౌతున్నట్లుంది పిల్లలకు. ఏమీ కాకనే నీరసించి పోయారు.

***

బడి బయట నలుగురు పిల్లలు- ఒక బర్రె చుట్టూ చేరి సందడి చేస్తున్నారు. నలుగురికీ చొక్కాలు లేవు. వాటిని విప్పి తలకు చుట్టుకొని ఉన్నారు. ఒకడు బర్రెమీద ఎక్కి అటూ ఇటూ కాళ్ళు వేసుకొని, దాన్ని పట్టుకొని, గుర్రం తోలినట్లు 'చల్! చల్!' అంటున్నాడు. మరొకడు దాని కొమ్ములకు రంగు కాయితాలు అంటిస్తున్నాడు. మిగిలినవాళ్లు ఇద్దరూ బర్రెకు నీళ్లు పోస్తున్నారు సంతోషంగా. వీళ్ల సేవలందుకుంటూ అది కదలకుండా నిలబడి, తృప్తిగా చూస్తున్నది.

కొత్తపల్లి నవంబరు 2010

"ఒరేయ్! మనం ఇయ్యాల్ల బడికి బోలేదని డ్రిల్ సారు కొడితే యలాగా?" అన్నాడు వాళ్ళలో ఒకడు.


"లేయ్! ఇయ్యాల్ల బాలల దినోస్త్తవం. మన్నల్నెవ్వరూ యేమీ అనరు!" అంటున్నాడు మరొకడు, ధీమాగా.

అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు!

కొత్తపల్లి బృందం

ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నవాళ్ళు కొత్తపల్లి పత్రికను వివిధ రూపాల్లో ఉచితంగా డౌన్లోడు చేసుకోవచ్చు. కొత్తపల్లి పత్రికలో ప్రచురితమయ్యే పాటల్ని నేరుగా వినవచ్చు, ఆ పాటల్ని కాపీ చేసుకోవచ్చు. కొత్తపల్లి పత్రికను ఆన్లైనులోనే పుస్తకం చదువుకున్నట్లు చదువుకునే వీలు కూడా ఉన్నది.

సందర్శించండి: http://kottapalli.in/2010/11



నీతి చంద్రిక

13 వ భాగం

మూలం: కీ.శే. పరవస్తు చిన్నయ సూరి　　*సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

జరిగిన కథ: దమనకం ఎద్దు దగ్గరికి వెళ్తుంది. దానికి సింహరాజు గురించి గొప్పగా చెప్పి, తనవెంట రమ్మంటుంది. ఆపైన అది ముందుగా పోయి, పింగళకునితో 'రంకె వేసిన ఎద్దును తమరి సమక్షానికి రమ్మందునా?" అని అడిగి అనుమతి తీసుకుంటుంది. ఇక చదవండి- నీతి చంద్రిక 13 వ భాగం.

అలా సింహం విలాసంగా తల ఎగురవేయగానే, నక్క దానికి వంగి వంగి నమస్కారాలు చేస్తూ వెనక్కి తిరిగి పోయి, సంజీవకుడిని కలిసింది: "నీ అదృష్టం బాగున్నది- మృగరాజు ఇప్పుడు ఒంటరిగా ఉన్నాడు. కనిపించటానికి ఇదే తగిన సమయం. ఆలస్యం చెయ్యకు- వెంటనే రా" అని దాన్ని పిలుచుకొని వచ్చి, రాజుకు ఎదురుగా నిలబెట్టింది. ఆపైన అది వంగి చేతులు కట్టుకొని, కొంత దూరంలో నిలబడింది. ఆ సమయంలో సంజీవకుడికి ఒకేసారి భయమూ, వినయమూ,

ఆశ్చర్యమూ మేళవించినట్లైంది. ఎంతో గౌరవంగా అది పింగళకుడికి అభివాదం చేసింది.

అప్పుడు మృగరాజు తన కనుసన్నల నుండి దానివైపు ప్రసన్న దృష్టిని ప్రసరింపజేస్తూ, " నిన్ను మా దమనకుడు అనేక విధాలుగా మెచ్చుకోగా, విని సంతోషించాము. నీలాంటి ధైర్యవంతుడు మా కొలువులో చేరేందుకు అంగీకరించటం మాకు సంతోషాన్నిచ్చింది. 'నువ్వు చేరటం వల్ల మాకు కూడా చాలా లాభం కలుగుతుంది' అని ఆశిస్తున్నాము. నీకు మంత్రి పదవిని ఇస్తున్నాము. మెలకువ కలిగి, మా ఆజ్ఞలకు అనుగుణంగా వర్తిస్తూ, మాకు బదులుగా పాలనా వ్యవహారాలను నిర్వహిస్తూ, మా పరివారాన్ని కాపాడుతూ, పనులన్నీ సజావుగా జరిగేటట్లు చూడు" అని ఆజ్ఞాపించింది.

ఇక ఆనాటినుండీ సింహం, ఎద్దు చాలా మంచి స్నేహితులైపోయాయి. ఏ పని చేయాలన్నా సింహం ఎద్దు పైనే ఆధారపడసాగింది. సింహం వెంట తిరిగే చిల్లర జంతువులకు పనిలేకుండా పోయింది- అవన్నీసింహం వెంట తిరగటం మానుకున్నాయి. సింహరాజు పరివారం కూడా తగ్గిపోయింది!



దాంతో దమనకానికి చాలా విచారం వేసింది. అది ఇంటికైతే పోయింది గానీ, దాని మనసు మనసులో లేదు. అది అట్లా బాధపడుతుండటాన్ని గమనించి కరటకుడు "తమ్ముడా! నీ ముఖం చిన్నబోయింది. విచారంగా ఉన్నావు- ఎందుకు?" అని అడిగింది. దమనకం దానికి జరిగినదంతా చెప్పింది.

కరటకం అప్పుడు కొంతసేపు మౌనంగా ఉండి, "జరిగిపోయిన దానికి ఊరికే విచారించి ఏమి లాభం? ఎన్నడో నేర్చిన నీతులన్నిటినీ

నువ్వు అంతగా వల్లించావుగానీ, నేను చెప్పేది ఒక్కటైనా చెవిన వేసుకున్నావా? వెనకటికి ఎవరో తనను కట్టేందుకు త్రాళ్ళు తానే కొని తెచ్చుకున్నాడట! -అట్లాగే నువ్వూనూ! జరగబోయే నష్టాన్ని గుర్తించకుండా, నీ నోటి దురదకొద్దీ ఆ ఎద్దు గురించి ఉన్నవీ లేనివీ కలిపి చెప్పి, దానికి రాజుతో స్నేహం కల్పించావు. ఇప్పుడు అనుభవించక తీరేనా? ఇది నువ్వు చేసిన తప్పే గదా?" అన్నది.

అప్పుడు దమనకుడు గట్టిగా నిట్టూర్చి, తలను అటూ ఇటూ ఊపి, చివరికి తలెత్తి "కరటకా, నువ్వన్నది నిజం. ముందు చూపు లేక, అట్లా చేశాను. ఇక ఇప్పుడు ఏమి చేయగలను? దైవం ప్రతికూలించినప్పుడు మానవ ప్రయత్నం ఏదైనావృధాయే అవుతుంది. కాబట్టి నన్ను ఊరికే తిట్టకు. ఇట్లా నేనే కాదు- 'ఆషాఢభూతి' అనేవాడి చేతిలో చిక్కి, వాడి గురువు తన ధనం యావత్తూ పోగొట్టుకున్నాడు. పొట్టేళ్ళ పోరులో చిక్కుకొని ఒక నక్క తన ప్రాణాలనే కోల్పోయింది"- నీకు ఆ రెండు కథలూ చెబుతాను విను- అని ఇలా చెప్పసాగింది:

ఆషాఢభూతి కథ:

చాలా కాలం క్రితం దేవశర్మ అనే దొంగ సన్యాసి ఒకడు ఉండేవాడు. అతని మనస్సు నిండా డబ్బు పట్ల వ్యామోహమే ఉండేది- కానీ పైకి మాత్రం అతను కోరికలు లేనివాడి మాదిరి, ఎప్పుడూ వేదాంతం గురించి, దాని అర్థం గురించి ఉపన్యాసాలు ఇస్తూ ఉండేవాడు. అతని ఉపన్యాసాలు వినే జనాల మనస్సులు విప్పారేవి. వాళ్ళు అతని మాటల్ని వినేందుకు ఎగబడేవాళ్ళు. అలా తనను కొలిచే భక్త సమూహం తనకు తెచ్చి ఇచ్చే డబ్బును చూసి అతను చిరునవ్వు నవ్వేవాడు. ఆ చిరునవ్వులో భక్తులకు ఆ డబ్బుల పట్ల ఆయనకున్న తృణీకార భావం వ్యక్తమయ్యేది. మరోవైపున ఆయన 'వారిని అనుగ్రహించటంకోసమేనా' అన్నట్లు ఆ ధనాన్ని స్వీకరిస్తున్నట్లుగానూ- అనిపించేది. చిరునవ్వుతో కూడిన ఆయన సుందర వదనం, అలా ఒకేసమయంలోరెండు భావాలనూ వ్యక్తం చేసేది.

అట్లా తాను భక్తులను మోసగించి

సంపాదించిన డబ్బునంతా ఆ దొంగ సన్యాసి ఒక బొంతలో వేసి, పదిలంగా కుట్టుకొని, ఆ బొంతను దూరం పోనివ్వక, దానినే ఎల్లప్పుడూ కప్పుకొని తిరిగేవాడు. అలాంటి ఆ సన్యాసి ధనాన్నంతా దొంగిలించాలి అనుకున్నాడు ఒక మోసగాడు! అయితే ఎన్ని రోజులు వేచి చూసినా వాడికి బొంతను కొట్టేసే ఉపాయం దొరకలేదు.



చివరికి ఒకనాడు- సన్యాసి తన భక్తుల ముందు కూర్చొని మోక్షం గురించీ, ధర్మం గురించీ శ్రవణానందకరంగా ఉపన్యసిస్తూండగా ఆతని సమ్ముఖానికి పోయాడు మోసగాడు. తన శరీరభాగాలన్నీ భూమికి తాకేటట్లు, ఆ సన్యాసికి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆపైన లేచి, అతని కంట పడేటట్లు, ఒక ప్రక్కకు ఒదిగి నిల్చున్నాడు. ఆ సన్యాసి చెప్పే ధర్మ పన్నాలను మనసు పెట్టి వింటున్నవాడి మాదిరి ముఖంపెట్టాడు. పెద్దగా విప్పారించిన కళ్ళు, ఆశ్చర్యాతిరేకంతో టప టపా కొట్టుకుంటుండగా, సంభ్రమంతో కూడిన వాని మాదిరి ముఖం పెట్టాడు. చాలా కాలంగా తనకేవో ధర్మ సందేహాలున్నట్లూ, స్వాముల వారి అప్పటి ప్రసంగంలో ఆ సందేహాలన్నిటికీ సమాధానం దొరికిపోతున్నట్లూ, తల ఊపుతూ నిలబడ్డాడు. మధ్య మధ్యలో ఎవరైనా జనాలు సద్దు చేస్తే, వారివైపు చికాకుగా, తిరస్కార పూర్వకంగా, కనుబొమ్మలు ముడివేసి చూస్తూ- తనకు వినటంలో ఆసక్తి ఉందనీ, తనకు శ్రవణభంగం కలిగించవద్దనీ చేతులెత్తి వారిస్తూ నిలబడ్డాడు. ఆ మహానుభావుడి అమృతవాక్యాలు వినటం వల్ల తనకు కలుగుతున్న ఆనందంతో వివశుడైపోయినట్లు, మూసుకున్న కళ్ళలోకి నీళ్ళు తెచ్చుకొని మరీ వణుకుతూ నిలబడ్డాడు.

సన్యాసి ఉపన్యాసం ముగించిన తరువాత వాడే పెద్దమనిషి మాదిరి అక్కడి ప్రజలతో "స్వాములవారు చాలా అలసిపోయి ఉన్నారు. ఇక్కడున్నవాళ్లంతా కొంచెం సేపు ఎడంగా ఉండండి. భిక్ష తర్వాత మళ్ళీ రండి, పొండి" అని వాళ్లందరినీ పంపించేసి, ఆపైన ఒక తాటాకు విసనకర్రను చేత బుచ్చుకొని, ప్రక్కన నిలబడి మెల్లగా వీచసాగాడు.

అప్పుడా దొంగ సన్యాసి ప్రేమగా అతనిని చూసి "ఓయీ! నువ్వెవరివి? మాకు సేవలు చేస్తున్నావెందుకు? మావల్ల నీకు ఏమి లాభం?" అని అడిగాడు.

అప్పుడా మోసగాడు "స్వామీ! నా పేరు ఆషాఢభూతి. ఇతరులకు అసాధ్యమైన గొప్ప సంపద మీలో దాక్కొని ఉన్నదని గ్రహించి, ఆ ధనాన్ని కోరి వచ్చాను. నన్ను మీ శిష్యుడిగా ఉండనివ్వండి. నాకోరికను నెరవేర్చి నన్ను అనుగ్రహించండి. ఇదికాక మరేది ఇచ్చినా నేను అంగీకరించను. నేను నిజమే తప్ప అబద్ధం చెప్పేదిలేదు" అన్నాడు (రెండు అర్థాలూ ధ్వనించేటట్లుగా).

అది విని సన్యాసి కొంచెంసేపు ఆలోచించి "సరే కానిమ్మ"న్నాడు. ఆపైన ఆషాఢభూతి మహా వినయాన్ని నటిస్తూ, సన్యాసికి ఎల్లవేళలా సపర్యలు చేస్తూ, అతని వెంబడే దేశాటన చేస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తూ గడిపాడు.

ఒకనాడు ఆ సన్యాసి ముందుగా దారివెంబడి పోతుండగా, వెనకనుండి పరుగెత్తుకొని వచ్చిన దొంగశిష్యుడు అతనికి ఒక గడ్డి పరకను చూపుతూ "స్వామీ! నిన్న రాత్రి మనం ఒక గృహస్తు ఇంటి చావడిలోపడుకున్నాం గదా! వాళ్ళ ఇంటి గడ్డి పరక ఒకటి, నా బట్టలను అంటుకొని వచ్చింది. ఇతరుల సొమ్ము-ఒక్క గడ్డిపోచ అయినా సరే, తీసుకోకూడదు. నేను వెంటనే వెనక్కి పరుగెత్తుకొని పోయి దీన్ని ఆ ఇంటి వాళ్ళకు ఇచ్చి వస్తాను" అని, కొంత దూరం వెనక్కి పోయి, ఆ గడ్డి పరకను అక్కడ పడేసి, కొంతసేపు అటూ ఇటూ తిరిగి, మళ్ళీ వెనక్కి వచ్చి సన్యాసిని చేరుకున్నాడు.

అది చూసి సన్యాసి ఆశ్చర్యపోయాడు: "ఆహా! ఈ ఆషాఢభూతి నిజంగా కోరికలు లేనివాడు; మచ్చలేని చరిత్రగలవాడు; చాలా

విశ్వాసపాత్రుడు" అనుకున్నాడు. తను చాలాకాలంగా శ్రమకోర్చి సంపాదించిన డబ్బునంతా దాచుకున్న ఆ బొంతను మోసేందుకు ఇప్పుడు అతనికి బద్ధకం వేసింది. తన వెంట వస్తున్న ఆ నయవంచకుడిని ప్రేమగా చూస్తూ, ఆ దొంగ సన్యాసి "ఓ ఆషాఢభూతీ! ముసలితనంతో బలహీనుడినవ్వటంచేత ఈ మాత్రపు కప్పుడు బొంతను కూడా మోయలేక పోతున్నాను. దీనిని జాగ్రత్తగా వెంట తీసుకొని రా నాయనా!" అని బొంతను వాడి చేతికి ఇచ్చాడు. దాన్ని అందుకుంటున్నప్పుడు ఆ మోసగాడి మనస్సు సంతోషంతో పులకరించి-పోయింది. వాడు చాలా ఒద్దికతో "మహా ప్రసాదం" అంటూ దాన్ని అందుకొని, చాలా జాగ్రత్తగా మోసుకొని రాసాగాడు. కావలసిన చోట దాన్ని సన్యాసికి పరుపుగాను, పైన కప్పుకునేందుకు రగ్గుగాను వినియోగిస్తూ, ఇదివరకటికంటే ఎక్కువగా నమ్మకం పుట్టే విధంగా సేవలు చేస్తూ వచ్చాడు.

ఒకనాడు ఆ సన్యాసి దారిన పోతూ ఉన్నాడు. సాయం సమయమైంది. 'సమయం' అనే పరశురాముడు వెయ్యి చేతులనూ ఖండించగా, బలాన్ని కోల్పోయి, రక్తంతో తడిసినట్లు ఎర్రని రంగుపూనిన కార్తవీర్యార్జునుడి లాగా కనిపిస్తున్నాడు సూర్యుడు. అక్కడికి దగ్గరలోనే ఒక చెరువు కనబడింది సన్యాసికి. అతను వెంటనే ఆ చెరువులోనికి దిగి, స్నానం చేద్దామని కొన్ని నీళ్ళు నోట్లో పోసుకున్నాడు.



అదే సమయానికి , ఎదురుగా, చెరువు ఒడ్డున రెండు పొటేళ్ళు భీకరంగా యుద్ధం చేసుకుంటూ కనబడ్డాయి అతనికి. రెండూ ఆవేశంతో ముందుకు వచ్చి ఢీ కొంటుంటే, చుట్టూ ఉన్న పర్వతాలనుండి వాటి ప్రతిధ్వనులు వినిపిస్తున్నాయి. ఆ శబ్దాలకు అవి మరింత రెచ్చిపోయి, ముందుకు దూకి -'ఫెడిల్' అని

ఢీకొంటున్నాయి. అలా అవి దారుణమైన యుద్ధంలో మునిగిఉండి, వాటి తలలు పగిలిన సంగతిని కూడా గమనించలేదు. అలా వాటి తలలనుండి కారిన రక్తం క్రింద నేలమీద పడి గడ్డకట్టింది.

అలా గడ్డకట్టిన రక్తాన్ని చూసి, దాపులనున్న ఒక నక్క 'మాంసపు ముక్క' అనుకున్నది. వెంటనే దాన్ని తినాలని ఆశ పుట్టింది దానికి. ఇక అది అటూ-ఇటూ చూసుకోలేదు; 'ఆ తావు పొటేళ్ళ యుద్ధరంగానికి మధ్యభాగం' అనికూడా గుర్తించక, ముందుకు ఉరికి, ఆ రక్తపు గడ్డను నాకటం మొదలు పెట్టింది. అంతకు ముందే ఒకదానినికటి ఢీకొని, వెనక్కి జరిగిన గొర్రెపొటేళ్ళు రెండూ మళ్ళీ పరుగున ముందుకు వచ్చి ఢీకొన్నాయి. వెర్రి నక్క ఆ రెండిటి మధ్యా చిక్కుకొని, నలిగి చచ్చిపోయింది.

స్నానానికి వెళ్ళిన సన్యాసి ఈ జరిగిన దాన్నంతా గమనించి- " అరే! మాంసం ముక్క మీది ఆశ నక్కను ఈ దశకు తెచ్చిందే! అన్ని దుర్గుణాల్లోకీచెడ్డది దురాశే గదా!" అని ఆలోచిస్తూ వెనక్కి తిరిగి, చెరువు గట్టెక్కి చూసేసరికి- తన దొంగ శిష్యుడు కనబడలేదు. "ఓహో! ఆషాఢభూతీ! ఓ, ఆషాఢభూతీ!" అని ఎంత అరిచినా ప్రయోజనం లేకపోయింది. అస్తమిస్తున్న సూర్యుడి వెలుగులకు చెయ్యి అడ్డం పెట్టుకొని, ఎంత దూరం వీలైతే అంత దూరం వరకూ చూస్తూ, వచ్చే పోయే జనాల దగ్గరికి పరుగులెత్తి, ఆ మోసగాడి గుర్తులు చెప్పి"ఇలాంటి వాడు, ఒక బొంత మోసుకొని పోతున్నాడు- వాడు మీకేమైనా ఎదురు పడ్డాడా?" అని అడుగుతూ, అన్ని దిక్కులా వెతికి వెతికి, చివరికి తనను ఆ దుర్మార్గుడు మోసం చేశాడని గుర్తించి, తల వంచుకొని, నిట్టూర్చుతూ "పొటేళ్ళ యుద్ధంలో దూరిన నక్క, ఆషాఢభూతి చేజిక్కిన నేను- ఇద్దరమూ మా సొంత తప్పుల వల్లనే చెడ్డాము. ఇక ఏం చేస్తాం?" అని బాధపడ్డాడు ఆ దొంగసన్యాసి.

ఈ కథ చెప్పి, కరటకం ఇలా అన్నది:

(మిగతాది మళ్ళీ వచ్చే మాసం..)



మాయబంతి



రచన: V.విష్ణు, పదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

అనగనగా ఒక ఊళ్లో విష్ణు అనే పిల్లవాడు ఉండేవాడు. విష్ణు చాలా తెలివైన పిల్లవాడు. అతనికి విజ్ఞానశాస్త్ర ప్రయోగాలంటే చాలా ఇష్టం ఉండేది. రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తూ ఉండేవాడు. వాళ్ల బడిలో చక్కని ప్రయోగశాల ఉండేది ఒకటి. అందులో రకరకాల పరికరాలు, చాలా రసాయనాలు పెట్టి ఉండేవి. వీలు చిక్కినప్పుడల్లా విష్ణు ఆ రసాయనాల పేర్లు చదివి, వాటిని గురించి అడిగి తెలుసుకొని మురిసిపోతూ ఉండేవాడు.

"మొక్కల్లో కూడా రసాయనాలు ఉంటాయిరా, మట్టిలోకూడా ఉంటై- అసలు రసాయనాలు లేని పదార్థమే లేదు" అని వాళ్ళ సైన్సు టీచరు గారు చెబుతుంటే, వినీ వినీ విష్ణుకు కొత్త కొత్త ఐడియాలు చాలా వచ్చేవి. అప్పటినుండీ వాడు మొక్కలతోటీ, గడ్డితోటీ,

మట్టితోటీ కూడా ప్రయోగాలు మొదలుపెట్టాడు.

"ఆ రసాయనాలతో అంతగా ఆడకురా, ఏమౌతుందో ఏమో!" అనేవాడు వాళ్ళ చిన్నాన్న. విష్ణు వాళ్ళ చిన్నాన్న కమ్మరి పని చేసేవాడు. ఆయనకు విష్ణుకున్న ప్రయోగాల పిచ్చి తెలుసు. జాగ్రత్తగా ఉండమని ఎప్పుడూ హెచ్చరిస్తూండేవాడు. అయితే విష్ణు మాత్రం ఆయన మాటల్ని కొట్టి పారేసేవాడు- "వీటితో ఏమీ కాదులే చిన్నాన్నా! ఇవన్నీ నిజానికి వ్యర్థ పదార్థాలేనట, తెలుసా? కంపెనీల్లో ఇంతకంటే చాలా శక్తివంతమైన పదార్థాలు వాడతారట" అనేవాడు.

ఒకసారి విష్ణు సబ్బు నీళ్ళతో బుడగలు చేయటం ప్రారంభించాడు. రకరకాల సైజుల్లో బుడగలు వస్తుంటే, సూర్యుడి కాంతిలో అవి రంగులు రంగులుగా మెరుస్తుంటే వాడికి చాలా సంతోషం వేసింది. కానీ కోతి బుద్ధిఎక్కడికి పోతుంది? ఆ నీళ్లలో రకరకాల రసాయనాలు, మొక్కల రసాలు కలపటం మొదలు పెట్టాడు. రాను రాను ఆ నీళ్ళు చిక్కబడి, పెద్ద పెద్ద బుడగలు తయారవ్వసాగాయి. ఆ బుడగలు ఇప్పుడు తొందరగా పగలటంలేదు కూడాను!


విష్ణుకి చాలా ఉత్సాహం కలిగింది. 'ప్రపంచంలోకెల్లా అతి పెద్ద బుడగను తనే తయారు చేస్తే ఎలాగుంటుంది?' అనిపించింది. 'అప్పుడు అందరూ తన పేరును గిన్నెస్ బుక్ లో రాస్తారు. మొహాలకు రంగులు పూసుకొని, అందరూ 'విష్ణు-విష్ణు-విష్ణు' అని అరుస్తుంటారు!'

ఇక విష్ణు ఆగలేకపోయాడు- ఆ నీళ్ళున్న బక్కెట్టును పట్టుకొని దగ్గర్లోనే ఉన్న ఒక పెద్ద కొండను ఎక్కాడు. పెద్ద బుడగనొకదాన్ని ఊదటం మొదలు పెట్టాడు. ఇప్పుడు నీళ్ళు చాలా చిక్కగా, జిడ్డుగా ఉన్నాయి. సూర్యకాంతిలో మెరుస్తున్నాయి. విష్ణు సంబరంగా ఊదుతుంటే పెద్ద బుడగ ఒకటి తయారవ్వసాగింది. ఎంత ఊదితే అంత పెద్దదౌతున్నది. పగిలేటట్లే లేదు అది! విష్ణు ఉత్సాహం అవధులు దాటింది. ఊదుతూ పోయాడు. అది ఇంకా పెద్దదైంది. విష్ణుకంటే పెద్దదైంది..ఆరడుగుల ఎత్తు..పది

అడుగులు..ఇరవై అడుగులు.. చూస్తూండగానే అది తాటిచెట్టంత పెద్దదైంది!

విష్ణు ఒకసారి ఊదటం ఆపి, దూరం జరిగి చూసుకున్నాడు దాన్ని- తృప్తిగా. అంతలోనే గాలివల్లనేమో, అది బక్కెట్లోంచి విడివడింది. జారి, దొర్లుకుంటూ పోసాగింది క్రిందికి. పైనుండి విష్ణు దాన్ని చాలా సంబరంగా చూస్తూ గంతులు వేయసాగాడు. అది పగలలేదు! రానురాను వేగం పుంజుకొని క్రిందికి దొర్లుతున్నది. మొదట్లో అది దొర్లటం మొదలు పెట్టినప్పుడు, దానికి అంటిన గడ్డిపోచలు, మట్టీ దానికి అతుక్కొని, దానితోబాటే దొర్లి పోవటం గమనించాడు విష్ణు- అయితే ఇప్పుడు దాని బంకగుణం ఎక్కువైనట్లుంది- బండలకు బండలే దానిలోకి ఇమిడిపోతున్నై! అది బండల్నేకాదు- అడ్డం వచ్చిన వాటిని అన్నిటినీ మింగేస్తున్నది! రాళ్ళు, చెట్లు, తుప్పలు- ఏవి అడ్డమొస్తే అవి ఆ బుడగలోకి చేరుకుంటున్నై.

చూస్తూండగానే ఆ బుడగ ఊళ్ళోకి ప్రవేశించింది. ఇళ్ళకి ఇళ్ళు ఆ బుడగలోకి చేరుకుంటున్నై. మనుషులంతా ఆ బుడగలోపల అతుక్కుని గింగిరాలు కొడుతున్నారు. ఊరంతా కకావికలైంది. ఎవరికి తోచిన దిక్కులో వాళ్ళు పరుగెడుతున్నారు. బంతి అన్నిటినీ మింగుతూ ఇంకా ఇంకా పెద్దదౌతూ పోయింది!



విష్ణుకి చెమటలు పోశాయి. ఆ బంతినెలాగైనా ఆపాలి. దాన్ని ఎలాగైనా పగలగొట్టేయాలి! ఎలాగ? ఆ కంగారులో వాడికి తను ఏఏ రసాయనాలు వాడాడో, వాటి విరుగుడు ఏమిటో- ఏమీ గుర్తుకు రాలేదు. వృధాగా వాడు దాని వెనక పరుగెడుతూ 'కాపాడండి, కాపాడండి' అని అరవటం

మాత్రం చేయగల్గాడు.

బుడగ విష్ణు వాళ్ళ ఇంటి సమీపానికి వచ్చేసరికి, విష్ణు వాళ్ళ చిన్నాన్న ఒక గునపాన్ని ఎర్రగా కాల్చి సరిచేస్తున్నాడు. ఈ అరుపులూ పెడబొబ్బలూ విని, ఆయన దాన్ని చేతబట్టుకొని బయటికి వచ్చాడు. చూస్తే పరమ భయంకరమైన బుడగ ఒకటి, సూటిగా తమ ఇంటిమీదికే వస్తున్నది. ఆయన ధైర్యంగా తన చేతిలోని గడ్డపారను ఎత్తి పట్టుకొని దాని మీదికి ఉరికాడు. బాగా వేడెక్కి ఎర్రగా కాలిన ఆ గునపం తగలగానే, అంత వేగంగా వస్తున్న బంతీ ఠపాలున పగిలింది. దానిలోఇరుక్కుని హాహాకారాలు చేస్తున్న మనుషులంతా ఎక్కడెక్కడికో విసిరేయబడ్డారు! ఆ బండలూ, రాళ్ళూ తగిలి కొందరికి గాయాలయ్యాయి గానీ, 'రాక్షసి బంతి ఇక లేదు' అన్న వాస్తవం అందరికీ సంతోషం కలిగించింది.

ఊళ్ళో వాళ్లంతా చిన్నాన్న ధైర్యాన్ని, సాహసాన్ని కొనియాడారు. చిన్నాన్నకు పూలమాలలు వేసి ఊరేగింపు చేశారు. 'ఎంత కష్టం తొలగించాడు!' అని పొగిడారు. ఆ హడావిడిలో విష్ణు మెల్లగా జారుకొని, ఇంట్లో ఓ మూలన నక్కి కూర్చుని, నిద్రలోకి జారుకున్నాడు. చాలా సేపటికి, చిన్నాన్న ఇంటికి వచ్చి, "ఒరే విష్ణూ, ఇకమీద ఎప్పుడూ రసాయనాలతో నీకు తెలీని ప్రయోగాలు చెయ్యకురా!" అనేంతవరకూ వాడికి మెలకువ రాలేదు! మెలకువ వచ్చాక ఆలోచిస్తే, తన బుడగ కథ నిజమో-కలో కూడా అర్థం కాలేదు వాడికి!

అంతా అందులోనే! **జోకు**

సన్ని: "అయాం గోయింగ్" అంటే అర్థం చెప్పరా?

బన్ని: నేను వెళుతున్నా!

సన్ని: ఆగరా, దీనికి సమాధానం చెప్పు?



మూగప్రేమ



రచన: G.వరలక్ష్మి, 7 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.

కొత్తపల్లిలో నరసమ్మ అనే ఒక పేద ముసలమ్మ ఉండేది. ఆమె భర్త నరసప్ప వ్యసనాలకు బానిస. కూలికి వెళ్ళి సంపాదించిన డబ్బంతా నరసప్ప తాగుడుకు, పేకాటలకు సరిపోయింది. ఆ ముసలి వయస్సులో నరసమ్మ రోజూ తిండికి వెతుక్కునే పరిస్థితి దాపురించింది. దానికి తోడు నరసప్ప బరువు ఎలాగూ ఉన్నది! ఆ దిగులుతో నరసమ్మ చిక్కి శల్యమైంది.

అంత గడ్డు పరిస్థితుల్లోనూ ఆమెకు ఆసరా, ఒక కుక్క. ఐదేళ్ల క్రితం నరసమ్మ రోడ్డుమీద పోతూ ఉంటే, కాళ్ళకు చుట్టుకుని 'కుయ్ కుయ్' మన్నది అది. 'చిన్నపిల్ల ఎలా బ్రతుక్కుంటుంది?' అని జాలిపడి, నరసమ్మ దాన్ని ఇంటికి తీసుకొచ్చి సాకింది. తనకు లేకపోయినా దానికి పెట్టి పెంచింది దాన్ని. ఇప్పుడు ఆకుక్కే నరసమ్మకు ఆసరా అయ్యింది. రోజూ నరసమ్మకోసం అది ఒక్కటొక్కటిగా కట్టెపుల్లల్ని ఏరుకొచ్చేది. నరసమ్మకు ఒంట్లోబాగుండక పడుకొని ఉంటే, అది సొంతంగా దుకాణానికి పోయి, ఏ

వస్తువుకావాలో దుకాణాదారుకు చూపించి మరీ తెచ్చిపెట్టేది.

నరసమ్మ ఆ కుక్కను ఎప్పుడూ కట్టేయలేదు. దాన్ని స్వేచ్ఛగా తిరగనిచ్చింది. పెద్దయ్యేకొద్దీ అది తన ఆహారాన్ని తనే సంపాదించుకోవటం మొదలుపెట్టింది. అడవిలో పక్షుల్నీ, చిన్న చిన్న జంతువుల్నీ వేటాడి తిని వచ్చేది. ఆపైన నరసమ్మకు సహాయం చేసేది. నిండా జుట్టుతో, సింహంలాగా బలంగా ఉండే ఆ కుక్కను చూస్తే ఊళ్ళోవాళ్ళకు ఒక వంక భయం, మరొక వంక ఆశ్చర్యం కలిగేవి.

అలా చాలా రోజులు గడిచాయి. ఒక రోజు ప్రొద్దున్నే కుక్క ఇంటికి వచ్చేసరికి నరసమ్మ లేవలేదు. తీవ్రమైన జ్వరం వచ్చిందామెకు. కుక్క తనకు చేతనైన సపర్యలు చేసింది. కానీ పెద్దగా ప్రయోజనం లేకపోయింది. నరసప్ప అయితే ఆమెను అసలు పట్టించుకోనేలేదు! అలా మంచం పట్టిన నరసమ్మ ఇక లేవలేదు. నాలుగు రోజులు బాధపడి, చివరికి చనిపోయింది. నరసప్ప యధావిధిగా తన బ్రతుకు తాను బ్రతకసాగాడు.

కానీ కుక్కకు మాత్రం చాలా బాధ వేసింది. నరసమ్మ పడుకున్న మంచం ప్రక్కనే పడుకొని, అది చాలా రోజుల పాటు అసలు లేవనేలేదు. చివరికి నరసప్ప దాన్ని చీదరించుకొని తరిమేసరికి, అది లేచి ఊరంతా తిరిగింది. అంత లావుగా, బలంగా, సింహంలాగా ఉన్న కుక్క ఇప్పుడు సన్నగా, బలహీనంగా అయిపోయింది. జాలికొద్దీ ఎవరైనా ఏమైనా పెట్టినా అది కనీసం ఆ తిండిని వాసనైనా చూడలేదు. అలా కొద్ది రోజులు ఊరంతా తిరిగిన తర్వాత అది నడుచుకుంటూ అడవిలోకి వెళ్ళిపోయింది. తర్వాత మరెప్పుడూ ఎవ్వరికీ కానరాలేదు.

'మూగప్రాణి- దానికి నరసమ్మ అంటే ఎంత ప్రేమో' అనుకున్నారు ఊళ్ళోవాళ్ళు.



మోసానికి మోసం



అరేబియా జానపద కథ

సేకరణ, కథనం: S.త్రివేణి, 10 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

చాలాకాలం క్రితం అరేబియా దేశంలోని ఒక పల్లెటూరిలో అబ్దుల్లా హుసేన్ అనే యువకుడు ఉండేవాడు. అతనికి పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళికూతురుకోసం నగలు కొనుక్కురావాలి. అతని తండ్రి హుసేన్ కు డబ్బులిచ్చి, "నాయనా! నీ భార్యకు ఎలాంటి నగలు చేయించుకుంటావో, మరి నీ యిష్టం. ఈ డబ్బు తీసుకెళ్ళి, పట్నంలో నీకు నచ్చిన నగలు చేయించు. పట్నంలో మోసాలు ఎక్కువ. జాగ్రత్త మరి! కొత్తవాళ్లను తొందరపడి నమ్మకు!" అన్నాడు. హుసేన్ ఆ డబ్బును జాగ్రత్తగా బనీను జేబులోదాచుకొని, పట్నం చేరుకున్నాడు.

హుసేన్ తెలివైనవాడే గాని, అమాయకత్వం పాలు కొంచెంఎక్కువే. కొంత సేపు అతను ఆ నగరంలోని వింతలు-విశేషాలను నోరు వెళ్ళబెట్టి చూస్తూ తిరిగాడు. అయితే ఎంత తిరిగినా నగల దుకాణం మాత్రం కనిపించలేదు అతనికి.

చివరికి ఇక చేసేదేమీ లేక, దగ్గర్లోనే నిలబడ్డ మనిషినొకడిని 'ఈ ఊళ్లో నగలదుకాణం ఎక్కడుంది?' అని అడిగాడు. అక్కడ నిలబడ్డవాడి పేరు జలాలుద్దీన్. నిజానికి వాడొక పెద్ద మోసగాడు. అమాయకులను మోసం చేసి డబ్బు లాక్కోవటమే అతని వృత్తి! హుసేన్‌కు ఈ సంగతి తెలీదు కద, పాపం!

జలాలుద్దీన్ హుసేన్‌ను పరీక్షగా చూస్తూ "నగల దుకాణమా, నాకు తెలీకేం? బాగా తెలుసు. అయినా ఎందుకు బాబూ, నీకది?" అని అడిగాడు, మరొక అమాయకుడు తన చేత చిక్కినందుకు లోలోపలే సంతోషిస్తూ. హుసేన్ ఆ సరికి బాగా అలసి ఉన్నాడేమో, అడిగినదే తడవుగా తన పేరు, ఊరు, పెళ్లి సంగతి, తన దగ్గర ఎంత డబ్బున్నదీ- అంతా చెప్పేశాడు జలాలుద్దీనుకు.

డబ్బు మాట వినగానే జలాలుద్దీన్ కళ్లు మెరిశాయి. "చూడు బాబూ! ఈ నగరంలో చాలా మంది మోసగాళ్ళుంటారు; జేబు దొంగలుంటారు. ఇలా నీ దగ్గర డబ్బున్న సంగతి ఎవ్వరికీ చెప్పకూడదు. నాకు చెప్పావు కాబట్టి సరిపోయింది గానీ, మరొకరైతే నీ పని ఇవాల్టితో ఆఖరయ్యేది" అన్నాడు. "అవునవును, మా నాన్నకూడా ఆ సంగతే చెప్పారు నాకు, మరచాను" అన్నాడు హుసేన్, ఒకింత సిగ్గు పడుతూ. "పరవాలేదులే. నావెంట రా. నిన్ను నీకు కావలసిన చోటికి చేర్చుతాను" అని, జలాలుద్దీన్ వాడిని తన వెంటబెట్టుకు పోయాడు.

కొద్దిసేపు నగరంలో ఆ వీధీ- ఈ వీధీ తిప్పేసరికి, హుసేన్ కు ఆకలైంది. "అయ్యో! ఆకలిగా ఉండకూడదు. నాకు తెలిసిన ఒక హోటలుంది. చక్కని మాంసం దొరుకుతుంది అక్కడ" అని, జలాలుద్దీన్ అతన్ని ఒక హోటల్లోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. పదార్థాలు వచ్చేలోగా, వాడు బయటికి వెళ్ళి, తన కూతురు అమీనాతో రహస్యంగా మంతనాలాడి, హుసేన్‌కి ఎలా టోకరా వేయాలో నిర్ణయించి, తిరిగి వచ్చి కూర్చున్నాడు.

వాళ్ళిద్దరూ భోజనం ముగించి బయటికి వచ్చేసరికి, అటువైపునుండి అమీనా గట్టిగా

ఏడుస్తూ వచ్చి హుసేన్ చేయి పట్టుకున్నది. "ఏంటిది, వదులు! నా చెయ్యి వదులు!" అన్నాడు హుసేన్ కంగారుగా. "ఇప్పుడు ఇక నన్ను తప్పించుకొని పోలేవు. నీతోటే నా జీవితం" అన్నది అమీనా గొంతుపెంచి.

ఆ సరికే దోవన పోయే మనుషులందరూ అక్క డ గుమిగూడారు. వాళ్ళంతా "పాపం! ఆడకూతురు!" అని జాలి కురిపిస్తూ "ఏమైంది తల్లీ! ఏమిటి నీ బాధ?" అని అడిగారు.

"చూడండి బాబూ! ఇతను నా భర్త. విపరీతంగా తాగుతాడు. మా నాన్న ఇతన్ని మా యింట్లో ఇల్లరికపు అల్లుడుగా పెట్టుకున్నాడు.." అని అమీనా ఇంకా ఏదోచెప్పబోతుండగానే "పచ్చి అబద్ధం. ఈమె ఎవరో నాకు తెలీదసలు" అని మొత్తుకున్నాడు హుసేన్.

"చూశారా, ఇదీ వరస! ఇతని పేరు అబ్దుల్లా హుసేన్, ఊరు ఫలానా" అని వివరాలన్నీచెప్పి, "కాదంటాడేమో అడగండి. నేను అతని భార్యనే అని మీకైనా నమ్మకం వస్తుంది." అన్నది అమీనా ఏడుపు పండిస్తూ.

"అవన్నీ నిజమే, గానీ నాకు మాత్రం ఈమె ఎవరో తెలీదు" అని ఎంత గొణిగినా హుసేన్ ని అక్కడచేరిన వాళ్లెవరూ నమ్మలేదు. "నా యీ తాగుబోతు మొగుడు మా ఇంట్లో ఉన్న సొమ్మంతా దొంగిలించి ఎక్కడికో పారిపోవాలని బయలుదేరాడు. నిన్నటినుండీ వెతుకుతుంటే ఇప్పటికి దొరికాడు- నా అదృష్టం బాగుండబట్టి. కావాలంటే అతన్ని సోదా చెయ్యండి" అనగానే జనాలు హుసేన్ జేబుల్లో వెతికి, అతను నగలకోసం తెచ్చుకున్న డబ్బును బయటికి లాగారు.

ఆలోగా జలాలుద్దీన్ అమీనా తండ్రిలాగా వచ్చి, మరికొంత మసాలా జోడించి, ఆ డబ్బును కాస్తా చేత పుచ్చుకొని చక్కా పోయాడు- "అమ్మా! నీ మొగుడూ, నువ్వూ మీ ఇష్టం- నా యింట్లో ఉండటం ఇష్టం లేకపోతే అతను నిన్ను ఎక్కడికి తీసుకెళ్తాడో అడుగు- ఇద్దరూ అక్కడికే పొండి" అని చెబుతూ.

అమీనా హుసేన్ చేయిపట్టుకొని లాగుతూ "నువ్వూ వచ్చెయ్యి. మా నాన్న ఇంట్లోనే ఉండు నోరు మూసుకొని" అని ఏడవసాగింది.

హుసేన్‌కి అప్పటికిగానీ తెలివి రాలేదు. "వీళ్లిద్దరూ తోడు దొంగలు! తనని మోసంచేసి తన డబ్బును ఎత్తుకు పోతున్నారు!" ఈ విషయం అర్థం కాగానే వాడు అమీనా చేతిని దొరకపుచ్చుకొని, వెంట లాక్కుని పోసాగాడు.

"బాగానే ఉందయ్యా, మీ వరస! భార్యాభర్తల మధ్య తగవులాటలుంటే ఇంట్లో తీర్చుకోవాలిగానీ, ఇలా రచ్చకెక్కవచ్చా?" అని అక్కడ మూగిన జనాలంతా ఎవరిదారిన వాళ్ళు పోయారు.

కొంత దూరం పోయాక, హుసేన్ అమీనాని "నిజం చెప్పు. నువ్వెవరు అసలు?" అని అడిగాడు. "జలాలుద్దీన్ మా నాన్న. నీలాంటి వాళ్ళని మోసం చేయటమే మా వృత్తి. అర్థమైంది గదా, ఇక నన్ను పోనీ" అని నవ్వి, చెయ్యి విడిపించుకోబోయింది అమీనా.

"అటుకాదు, ఇటు, నడు. ఇప్పుడు నేను నీ భర్తను. పదిమంది ఎదుటా నువ్వు అలా ప్రమాణం కూడా చేశావు. మీ నాన్న కూడాను. కనుక నేనెట్లా చెబితే నువ్వు అట్లా చేయాలి. మన దేశపు చట్టం ప్రకారం భార్యలు భర్త ఆస్తి కిందే లెక్క. రా, నువ్వు!" అని, హుసేన్ ఆమెను సంతకు తీసుకు వెళ్ళాడు.



ఆ రోజుల్లో అరేబియా దేశపు సంతల్లో మనుషుల్ని బానిసలుగా అమ్మటం, కొనటం జరుగుతుండేది. ఇప్పుడు హుసేన్ సంతలో తన భార్య 'అమీనా'ను బేరానికి పెట్టాడు. ఒకరు వంద దీనారాలు ఇస్తామంటే ఒకరు వెయ్యి ఇస్తామంటున్నారు. అమీనా 'వీడు అసలు నా భర్తే కాదు' అని ఏడుస్తున్నది.

సంగతి తెలిసి జలాలుద్దీన్ కూడా ఆదరా బాదరాగా అక్కడికి చేరుకున్నాడు. "నా కూతురు! నా కూతురు" అంటూ. "నీ కూతురు కాదు- నా భార్య!" ఇందాక రోడ్డు మీద పదిమంది ఎదుటా ఈమెను నాకు

అంటకట్టేశావు కద నువ్వు!" అని మంకుపట్టు పట్టాడు హుసేన్. ఆ గొడవ విని రాజభటులు అందరినీ పట్టుకొని పోయి న్యాయాధికారి ముందు నిలబెట్టారు.

న్యాయాధికారి ముందు హుసేన్ నిర్భయంగా జరిగిందంతా చెప్పాడు. అమీనా, జలాలుద్దీన్‌లు గతంలో అనేకమందిని మోసగించిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. దాంతో న్యాయాధికారి హుసేన్‌కు డబ్బులు వెనక్కి ఇప్పించటమేగాక, నేరస్తులను కఠినంగా శిక్షించాడు. తెలివిగా నేరస్తులను పట్టించినందుకు హుసేన్ ను ప్రశంసించాడు. ఆపైన హుసేన్‌కు నగల దుకాణం సులభంగానే దొరికింది!

జోకులు

వెలుగమ్మా!

సందీప్: ఏంట్రా కరెంట్ పోయినా ఇంట్లో దీపం పెట్టలేదేంటి?

ప్రశాంత్ : మా ఆవిడ చదువుకుంటోందిరా, అందుకని.

సందీప్: అయితే?

ప్రశాంత్: " ఇల్లాలి చదువు- ఇంటికి వెలుగు" అన్నారుకదా, ఇక వేరే దీపం ఎందుకు, దండగ?

చక్కని మార్గం!

రాము: దోమలు విపరీతంగా ఉన్నాయి. ఏం చెయాలో అర్థం కావట్లేదు.

రమేష్: ఓ పని చెయ్యి- ఇంటికి ' టులెట్' అని బోర్డు పెట్టు, 'ఇల్లు ఖాళీగా ఉందిగదా' అనుకొని, దోమలు లోపలికి రావు.



నిజం దాగదు

అనంతపురం జిల్లా జానపద కథ.

సేకరణ, సవరణ: c.కాంతమ్మ, 8 వ తరగతి, ప్రకృతిబడి.



సీతమ్మ చక్కని చుక్క. పైగా గర్భవతి. అయినా ఆమె మొగుడు ఆమెను చీదరించుకునేవాడు. అత్త-మామ ఇద్దరూ ఆశపోతులు. అడిగినంత కట్నం తేలేదని ఆమెను ఎప్పుడూ తిడుతుండేవాళ్ళు. 'నువ్వు చచ్చిపోతే మా కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేస్తాం" అని సాధించేవాళ్ళు. సీతమ్మ ఇవన్నీ భరిస్తూ జీవితాన్ని ఎలాగో ఒకలా నెట్టుకొచ్చేది.

సీతమ్మకు మాంసం కూర అంటే చాలా ఇష్టం. ఒకరోజున అత్త మామ మాంసం కూర చేశారు. తీరా సీతమ్మ తినాలనుకునేసరికి, వాళ్ళు "కందికట్టె పూర్తిగా అయిపోయింది- చేనుకెళ్ళి కందికట్టె తీసుకురా" అని పంపించారు. సీతమ్మ చేనుకు వెళ్ళి తిరిగి వచ్చేలోగా ఆమె అత్త, మామ, భర్త ముగ్గురూ కూరను పూర్తిగా లాగించేశారు. అంతేకాకుండా, రోడ్డుమీద

దొరికిన పామునొకదాన్ని ముక్కలు చేసి, దాన్ని వండిపెట్టారు సీతమ్మకోసం!

ఆకలిగా ఉన్న సీతమ్మ పాపం, ఆ పాము చారునే తిన్నది. తినగానే ఆమెకు వాంతులు-బేదులు మొదలయ్యాయి. నాలుగైదు గంటలపాటు ఆమె బాధపడినా అత్తమామలుగాని, భర్తగాని ఆమెను పట్టించుకోలేదు. చివరికి ఊరి చివరనున్న తోటలోకి పరుగెత్తిన సీతమ్మ అక్కడే చనిపోయింది.

"అయ్యో నా భార్య! చనిపోయింది" అని దొంగ ఏడుపులు ఏడిచి, భర్త, అత్త-మామలు కలిసి ఆమెను అక్కడే సమాధి చేసేసి, 'పీడ విరగడైంది' అని సంతోషపడ్డారు. త్వరలోనే ఆ సమాధి మీద చాలా అందమైన పూలు- చేమంతులు, గులాబీలు, గుండుమల్లెలు పూసాయి.

ఈ సంగతంతా తెలీదు, సీతమ్మ తల్లిదండ్రులకు. వాళ్ళు పాపం, సీతమ్మకు శ్రీమంతం చేద్దామని బయలుదేరి వచ్చారు. ఇంకా ఊళ్ళోకి పోకనే వాళ్ళకు ఒక చక్కని తోట కనబడింది. ఆ తోటలో ఒకచోట అందమైన పూలు కనబడితే, సీతమ్మ చెల్లెలు తన అక్క శ్రీమంతం కోసం ఆ పూలు తెద్దామని వెళ్ళింది. ఆమెను చూడగానే అక్కడున్న చేమంతులు

"రావద్దు చెల్లీ!
రావద్దు చెల్లీ!
వస్తే ప్రమాదం చెల్లీ!
పాము తినిపిస్తారు!
వెళ్ళిపో చెల్లీ" అని పాడాయి.

సీతమ్మ చెల్లెలు గబగబా వెనక్కి వెళ్ళి వాళ్ల అమ్మతో "అమ్మా! అక్కడ అక్క మాటలు వినబడుతున్నాయి. చేమంతులు ఏమేమో చెబుతున్నై, నువ్వు పోయి చూడు" అన్నది. "పూలు మాట్లాడేది ఏమిటి", అని సీతమ్మ తమ్ముడిని పంపింది వాళ్లమ్మ.

వాడిని చూడగానే చేమంతులు

"రావద్దు తమ్ముడా!
రావద్దు తమ్ముడా!
వస్తే ప్రమాదం తమ్ముడా!
పాము తినిపిస్తారు,
వెళ్ళిపో తమ్ముడా!" అని పాడాయి.

వాడు కూడా వెనక్కి వచ్చాక ఈసారి సీతమ్మ తల్లి స్వయంగా వచ్చి చూసింది. ఆమెను చూడగానే చేమంతులు ఏడుస్తూ

"రావద్దు తల్లీ!

రావద్దు తల్లీ!

వస్తే ప్రమాదం తల్లీ!

పాము తినిపిస్తారు,

వెళ్ళిపో తల్లీ!" అన్నాయి. వాటి గొంతును గుర్తు పట్టిన సీతమ్మ తల్లి, "అయ్యో! పదండి త్వరగా! సీతమ్మకు ఏదో అయినట్లుంది. వీళ్ళు ఏదో చేసినట్లున్నారు. పోయి చూద్దాం పదండి" అని, అందరినీ వెంటబెట్టుకొని త్వరత్వరగా వెళ్ళింది సీతమ్మ అత్తగారింటికి.

వీళ్లను చూడగానే సీతమ్మ భర్త, అత్త-మామలు అందరికీ పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్లైంది. "మా బిడ్డ సీతమ్మ ఏది?" అని అడిగితే వాళ్ళు నీళ్ళు నమిలారు- ఒక్కొక్కరూ ఒక్కో సమాధానం చెప్పారు. సీతమ్మ బంధువులందరికీ మోసం అర్థమైంది. వాళ్లంతా ఆమె భర్తమీద, అత్త మామలమీద పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుననుసరించి పోలీసులు దర్యాప్తు జరిపే సరికి, నిజం బయట పడింది. సీతమ్మ భర్తను, అత్తను, మామను అందరినీ పోలీసులు జైలులో పెట్టారు. దుర్మార్గులకు తగిన శిక్షలే పడ్డాయి.

ఇప్పుడు సీతమ్మ సమాధి చుట్టూ చక్కని పూలతోట ఏర్పడ్డది.

దాని చుట్టూ పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం తయారైంది.

పిల్లలంతా సంతోషంగా ఆడుకుంటుంటే, చేమంతులు పాడుతున్నై-

"రండి రండి పిల్లలూ!

చక్కని పిల్లలూ!

ఆడుకోండి, పాడుకోండి,

మంచి వ్యక్తులుగా ఎదగండి!

కల్లలొద్దు, కపటం వద్దు,

అందరు ఒకటేనండీ!

రండి రండి పిల్లలూ!

ఆడుకోండి పిల్లలూ" అని.



నిమ్మ-దానిమ్మ



సేకరణ: T.పోతన్న, 9 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.



ఒకసారి ఒక ఋషి అడవిలో పోతున్నాడు. ఎండ మండిపోతున్నది. అప్పుడాయనకు ఒక నిమ్మచెట్టు కనబడింది. "రండి స్వామీ! నా నీడన కూర్చోండి! నా పళ్ళ రసం తాగండి" అని పిలిచింది నిమ్మ.



ఋషికి నిమ్మ చెట్టు చాలా నచ్చింది. "నీకొక వరం ఇస్తాను నిమ్మా! అయితే ఇప్పుడు కాదు. సరిగ్గా నెల తర్వాత, కొండల అవతల నేనుండే గుహకు రా, నువ్వు. సరేనా?" అన్నాడు.

"సరే" అని, నెల తర్వాత కొండలు దాటేందుకని బయలుదేరింది నిమ్మ. దారిలో పేరులేని చెట్టొకటి కలిసింది దానికి. చిన్న చిన్న ఆకులతో, వికారంగా ఉంది అది. "నేనూ వస్తానమ్మా, నీతో! ఋషిని నేనూ చూస్తాను" అన్నదది.



"సరే" అని దాన్నీ వెంట బెట్టుకొని, కొండలు దాటటం మొదలెట్టింది నిమ్మ.

దాటీ దాటీ నిమ్మకు చాలా అలసట వచ్చింది. "నువ్వు ముందు నడుస్తుండు" అని పేరులేని చెట్టును ముందుగా పంపింది అది.

పేరులేని చెట్టు గుహను చేరుకునే సరికి, ఋషి కళ్ళు తెరిచాడు- "దా,నిమ్మా" అని పిలిచాడు.

పేరులేని చెట్టు భయపడుతూనే ఋషిముందుకెళ్లి నిలబడింది. వంగి నమస్కారం చేసింది. "నేను నిమ్మను కాదు. నాకు పేరు లేదు. నిమ్మ చెట్టుకు నీరసం వచ్చి, వెనకబడ్డది. కొంత సేపట్లో వస్తుంది- ఆగండి!" అన్నది. అంతలోనే నిమ్మకూడా అక్కడికి చేరుకొని ఋషికి నమస్కారం చేసింది.

ఋషి నిమ్మ చెట్టుతో "అందరి నీరసాన్నీ పోగొట్టే నీకు నీరసం ఏంటి? నీ రసం తాగితే ఎంత నీరసించిన మనుష్యులకైనా నీరసం పోయి శక్తి చేకూరుతుంది. నీ విత్తనాలను ఎవ్వరూ తినరు. అలా నీ వంశం వృద్ధి చెందుతుంది. జంతువులు నిన్ను బాధించకుండా నీకు ముళ్ళను ప్రసాదిస్తున్నాను. సంతోషంగా బ్రతుకు" అన్నాడు.

చెట్లు రెండూ నమస్కారం చేసి వెనక్కి తిరిగాయి. అప్పుడు ఋషి రెండవ చెట్టుతో అన్నాడు "నీకు పేరు లేదనుకోకు. ఇందాక నిన్ను పిలిచానుకదా, 'దా,నిమ్మా' అని? ఇకనుండీ నీ పేరు అదే. నీ విత్తనాలు తినేందుకు ఎక్కడెక్కడి మనుషులూ తహతహలాడతారు. నీ పండ్ల తొక్కు, గుజ్జు- అన్నీ మందులుగా పనికి వస్తాయి. మీరిద్దరూ మానవజాతికి దేవుడిచ్చిన వరాలుగా పేరుగాంచుతారు. సంతోషంగా వెళ్ళండి" అన్నాడు.



ఆనాటినుండి నిమ్మ, దానిమ్మలు మానవులకు శక్తిని, ఆరోగ్యాన్ని అందిస్తూ ఉన్నాయి. నిజంగానే అవి మనకు దేవుడిచ్చిన వరాలైనాయి!

కోడి అందం



సేకరణ: N. అశోక్‌కుమార్, 9 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

ఒక ఊళ్ళో కోడిపుంజు ఒకటి ఉండేది. అది చాలా అందంగా ఉండేది. రంగురంగుల రెక్కలు, పెద్ద పెద్ద కాళ్ళు, బలమైన గోళ్ళు, చక్కగా వంపు తిరిగిన ముక్కు, ఎర్రని తురాయి- తన అందం చూసుకొని అది మురిసిపోతుండేది. ఎప్పుడూ "ఇంకా ఎన్ని సోకులు చేసుకోవాలా?" అని ఆలోచిస్తూ ఉండేది. మిగతా కోళ్ళ తనంత అందంగా లేవని చిన్నచూపు చూసేది.





రైతు ఇంటి ముందు ఒక పెద్ద చెట్టు ఉండేది. ఆ చెట్టు మీద ఒక గ్రద్ద నివసిస్తూ ఉండేది. ఎలాగైనా ఈ కోడిని తినాలని దానికి చాలా ఆశగా ఉండేది. 'అదను చూసి ఎగవేసుకు పోదాం' అని చాలా కాలం పాటు వేచి చూసిందది.

ఒకసారి కోడి చెట్టు క్రింద పురుగులను ఏరుకుంటుంటే 'ఇదే అదను' అని గబుక్కున మీదికి

దూకింది గ్రద్ద.

ఏమరుపాటు లేని కోడి మెరుపులాగా పోయి, ఆ చెట్టుకున్న తొర్రలో దూరింది.



గ్రద్దకు తెలుసు- తను ఎంత ప్రయత్నించినా తొర్రలో దాక్కున్న కోడి తనకు చిక్కదని. అందుకని అది అన్నది-"కోడి మరదలూ,కోడి మరదలూ! నీ అంత అందమైన కోడి ఎక్కడా లేదని ప్రపంచంలో అన్ని పక్షులూ చెప్పుకుంటున్నాయి. అందుకే నేను నిన్ను చూడటానికి వచ్చాను. నువ్వు నా ఇంటి ప్రక్కన ఉండటం నిజంగా నాకు గర్వకారణం!"అని.



వెర్రి కోడి ఆ మాటలకు పొంగిపోయింది. "ఇన్నాళ్లకు నా అందాన్ని గుర్తించే పక్షి ఒకటి ఎదురైంది" అని కులుక్కుంటూ బయటికి వచ్చింది.

వేచి చూస్తున్న గ్రద్ద ఒక్క ఉదుటున దానిమీదికి దూకి పట్టుకుపోయి, చంపి తినేసింది.



పరివర్తన



'అల్లరి పిల్లల్లో పరివర్తన ఎలా వస్తుంది?' అన్న ప్రశ్నకు సమాధానం దొరకటం నిజంగా కష్టం. సందర్భాలు కలిసి రావాలి, పరిస్థితులు అనుకూలించాలి, ఓపికగా ప్రయత్నించే పెద్దలూ ఉండాలి. అల్లరి విష్ణులో దానంతట అదే వచ్చిన మార్పు గురించి చెప్పే ఈ సాదాసీదా 'యదార్థ కథ' చూడండి.

రచన: V. భాస్కర్, పదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిపేరు పాతచెరువు. ఆ ఊరిలో ఒక పేద కుటుంబం ఉండేది. ఆ కుటుంబంలోఅమ్మ, నాన్న, వాళ్ళిద్దరి కొడుకు విష్ణు అనేవాడు- ఉండేవాళ్ళు. వాడిని వాళ్ళ అమ్మానాన్నలు బాగా చదివిస్తూ ఉండేవాళ్ళు- కానీ విష్ణు మాత్రం ఏమీ చదవకుండా, స్కూలులో పిల్లలతో పోట్లాడుతూ, చెడ్డమాటలు మాట్లాడుతూ, అల్లరి చేస్తూ ఉండేవాడు. ఎలాగో ఒకలాగ వాడు 5 వ తరగతి వరకూ ఉన్న ఊళ్ళోనే చదువుకున్నాడు.

అప్పుడు వాళ్ల అమ్మానాన్నలు వాడిని చూసి "ఇక్కడే ఉంటే వీడు చాలా అల్లరిపట్టిపోతాడు. వీడిని వీళ్ల మామ ఇంట్లో ఉంచి

చదివించటంమంచిది" అనుకున్నారు. వాళ్ళ మామ కూడా దానికి ఒప్పుకుని, సెలవల్లో వచ్చి వాడిని పిలుచుకు పోయి, వాళ్ళ ఊళ్ళో ఉన్న ఒక చిన్నబడిలో చేర్పించాడు వాడిని.

ఆ బడిలో పిల్లల్ని కొట్టరు. వాళ్ళు చదివితే చదివిస్తారు; లేకపోతే కూడా ఏమీఅనరు. ఆ బడిలో చేరుకున్నాక కూడా విష్ణు అల్లరి మానలేదు. ఎప్పటిలాగానే ఉన్నాడు. ఈ విషయం తెలుసుకొని, విష్ణు వాళ్ళ మామ మొదటగా మాటలతో చెప్పి చూశాడు. అయినా కూడా విష్ణు మారకపోవటంతో వాళ్ల మామకు కోపం వచ్చి, విష్ణుని కొట్టి, తిట్టి, కసురుకొని చెప్పాడు. ఏం చేసినా విష్ణులో మార్పు రాలేదు. ఎప్పటిలాగానే అల్లరి చేస్తున్నాడు.

విష్ణుకి మంచి స్నేహితుడు భాస్కర్. భాస్కర్ కూడా అల్లరి పిల్లవాడే; కానీ అతనుకూడా విష్ణుకు ఎన్నో రకాలుగా చెప్పి చూశాడు. "విష్ణూ! మీ అమ్మనాన్నలు నీకోసం ఎంతో కష్టపడి పనిచేసి నిన్ను చదివిస్తున్నారు. మీ మామవాళ్ళు కూడా నీగురించే తన్నుకలాడుతున్నారు. ఇలా చేస్తే ఎలాగ?" అని చెప్పి చూశాడు. ఎంత చెప్పినా విష్ణులో మాత్రం పెద్దగా మార్పు వచ్చినట్లు లేదు.

అయితే కాలం గడిచేకొద్దీ విష్ణులో చాలా మార్పు వచ్చింది. అల్లరి కొద్ది కొద్దిగా తగ్గ సాగింది. ఏడవ తరగతిలో తను అల్లరి చేయకుండా బుద్ధిగా చదువుకొన్నాడు. పోట్లాటలు తగ్గించేశాడు. ఏడవ తరగతిలోమంచి మార్కులు వచ్చేసరికి, వాడికి చదువంటే ఇష్టం పెరిగింది. అల్లరి అల్లరిగానే 8-9 తరగతులు చదివిన విష్ణు, ఆపైన పదవ తరగతిలో ఎంత చక్కగా చదివాడంటే, వాడిప్పుడు 500 కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని అనుకుంటున్నాడు! (అంతకంటే గొప్పసంగతి ఒకటుంది- చాలా చక్కని కథలు రాస్తున్నాడు, కల్పించి-కల్పించి!)



సౌందర్య చదువు



రచన: N.అశ్వని, 10 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

కొత్తపల్లిలో నివసించే రామయ్యకు ఒక్కగానొక్క కూతురు సౌందర్య. పేరుకు తగ్గట్లే సౌందర్య చాలా అందంగా ఉండేది. పదవ తరగతిలో ఉన్న సౌందర్య, వాళ్ల బడిలో ఏ పోటీ జరిగినా అన్నింటిలోనూ మొదటి స్థానంలో ఉండేది.

రామయ్య ఆర్థిక స్థితి అంతంత మాత్రమే. పేరుకు రైతేగాని, ఆయనకున్న మూడెకరాల చేనునుండి వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు ఏమాత్రం సరిపోయేది కాదు. "మీ అమ్మాయి కూడా పెద్దదవుతున్నది. ఇక పెళ్ళి చేసెయ్యి. లేకపోతే రేప్పొద్దున కట్నం ఎక్కడినుండి తెస్తావు? పెళ్లి కాని బిడ్డ-గుండెల మీద కుంపటి" అనటం మొదలుపెట్టారు అతని పరిచయస్తులు.

వాళ్ల ఒత్తిడికి లొంగిన రామయ్య, ఇంకా పదహారేళ్లయినా రాని సౌందర్యకోసం పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. ఒకరేమిటి, చేసుకుంటామని పదిమంది ముందుకొచ్చారు. వచ్చిన వాటిలో తనకు

నచ్చిన సంబంధాన్ని ఒకదాన్ని నిశ్చయించేశాడు రామయ్య.

అయితే సౌందర్య మాత్రం పెళ్ళి చేసుకోనని మొండి కేసింది. అంత చిన్న వయస్సులో పెళ్ళి చేసుకోకూడదని తెలుసు, ఆమెకు. అదీగాక, ప్రభుత్వం బాల్యవివాహాలను నిషేధించింది కూడానూ- "పద్ధెనిమిదేళ్ళు నిండని అమ్మాయికి పెళ్ళి చేయటం చట్టరీత్యానేరం" అని సౌందర్య చదువుకొని ఉన్నది. కానీ ఎన్ని విధాలుగా చెప్పినా రామయ్య ఒప్పుకోలేదు. 'పెళ్లి ఆపటం వీలవదు' అని తేల్చి చెప్పేశాడు. సౌందర్య ఏడిచింది, అలిగింది, 'నాకు ఇంకా చాలా చదువుకోవాలని ఉంది' అన్నది- ఎంత చెప్పినా రామయ్యమాత్రం పట్టించుకోలేదు.

ఇక 'వచ్చే వారమే పెళ్లి' అనగా సౌందర్య ఇంట్లోంచి పారిపోయి, హైదరాబాదు వెళ్ళే రైలు ఎక్కేసింది!

అయితే ఆమె అదృష్టం కొద్దీ అదే రైలులో ఎక్కారు, వాళ్ళ సోషల్ అయ్యవారు. బాగా చదువుకొనే సౌందర్య అంటే ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది. "ఏమ్మా, సౌందర్యా, ఒక్కదానివే ఎటు, బయలుదేరావు?" అని అడిగారాయన. సౌందర్యకు ఏడుపు ఆగలేదు. జరిగిందంతా చెప్పి, "సార్! నేను బాగా చదువుకుంటాను సార్! నన్ను ఏదైనా హాస్టలులో చేర్పించండి సార్!" అని భోరుమని ఏడ్చింది.

వాళ్ల సోషల్ అయ్యవారు మంచివాడూ, లోకం తెలిసినవాడు కూడానూ. ఆయన ముందుగా సౌందర్యను చీవాట్లు పెట్టారు-"ఏమనుకుంటున్నావు నువ్వు? ఇట్లా ఒక్కదానివి రైలెక్కేస్తే ఎంత ప్రమాదమో తెలుసా, నీకు అసలు? పట్టణాలలో ఎంతమంది మోసగాళ్ళుంటారో నీకేమి ఎరుక? ఇంట్లో ఏమైనా కష్టాలొస్తే, పెద్దవాళ్లతో చర్చించి, సామరస్యంగా వాటికి పరిష్కారం వెతకాలి తప్ప, ఇట్లా ఇల్లు వదిలి పారిపోతారా? పద పద, వెనక్కి. నేను కూడా వచ్చి నిన్ను మీ ఇంట్లో దిగబెడతాను. నేను చెబుతానులే, మీ నాన్నకు" అని. ఆయన కూడా సౌందర్యతోబాటు తరవాతి స్టేషన్‌లో రైలు దిగి, ఆమెను వెంటబెట్టుకొని రామయ్య దగ్గరికి

వచ్చారు.

ఆసరికి సౌందర్య కనబడటంలేదని రామయ్య కుటుంబం అంతా గందరగోళపడుతున్నది. సౌందర్యను చూడగానే వాళ్ల ప్రాణం లేచివచ్చినట్లైంది. సోషల్ అయ్యవారు రామయ్యను, అతని భార్యను పిలిచి,"అమ్మాయి ఇష్టానికి విలువనివ్వండి. చదవనివ్వండి. ముందు చదువు-ఆ తర్వాతే పెళ్ళి! ఒక వేళ చదివించటం మీకు కష్టమనిపిస్తే, మన ఊరికి దగ్గర్లోనే ప్రభుత్వ హాస్టల్ ఉంది- అందులో చేర్చండి. ఈ సంబంధం వాళ్లని ఆగమనండి కొన్నేళ్ళు. ఏమీ పరవాలేదు. అలా చెయ్యకపోతే, మీ అమ్మాయి భవిష్యత్తు నాశనం కాదా?" అని చెప్పి ఒప్పించారు.

అటు తర్వాత రామయ్య తన కూతురును పెళ్ళి విషయమై ఒత్తిడి చేయలేదు. ప్రభుత్వ సహకారంకూడా తోడై, సౌందర్య చక్కగా చదువుకున్నది. ప్రతి తరగతిలోనూ ఆమెకు బహుమతులూ, స్కాలర్‌షిప్పులూ వచ్చేవి. పెద్ద చదువులు చదివి, పోటీ పరీక్షల్లో నెగ్గి, సౌందర్య ప్రభుత్వ ఆఫీసర్ అయ్యింది. "ఎంత చక్కని ఆఫీసర్!" అని అందరూ ఆమెను పొగుడుతుంటే, రామయ్య దంపతుల కళ్ళు గర్వంగా మెరిసేవి- "అయ్యో, ఈ పాపకు చిన్నప్పుడే పెళ్ళి చేసేసి ఉంటే ఏమయేది? ఆ సోషల్ సారు దేవుడిలాగా అడ్డుపడ్డాడు కాబట్టి సరిపోయింది." అనుకునే వాళ్ళు ప్రతిరోజూ.

పాపం పిసినారి! జోకు

చింటు: నాన్నా! పక్కింటి వాళ్ళు పిసినారులా?

తండ్రి: లేదే, ఎందుకొచ్చిందిరా, నీకా అనుమానం?

చింటు: వాళ్లబ్బాయి పావలా మింగాడట. మరి ఆ మాత్రం దానికే వాళ్ళు అంతగా ఎందుకు ఏడుస్తున్నారు?



సుఖం ఎక్కడ?



రచన: P.రాజమ్మ, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

కొత్తపల్లిలో రాజు అనే పిల్లవాడు ఉండేవాడు. వాడికి పక్షులన్నా, జంతువులన్నా, చెట్లన్నా చాలా ఇష్టం. రోజూ అడవికి పోయి పాటలు పాడుకుంటూ తిరగటం, వాగుల్లోకి దిగి ఈతకొట్టటం చేస్తుంటాడు.

ఒకసారి వాడికి జ్వరం వచ్చింది. ఎటు పోయేందుకూ శక్తి లేకుండింది. అమ్మానాన్నలు పనులు మానుకొని కూర్చుంటే ఎట్లా? రాజును ఇంట్లోనే వదిలి వాళ్ళు కూలికి పోయారు. ఒంటరిగా ఉన్న రాముకు అడవి గుర్తుకొచ్చింది. 'అడవిలో పక్షులు, జంతువులు ఎంత హాయిగా బ్రతుకుతాయో! వాటికి ఇన్ని కష్టాలుండవు. చక్కగా ఎగురుకుంటూ, పాడుకుంటూ తిరుగుతాయి; ఆకలి వేస్తే దొరికిన పండ్లను తింటాయి, అలసిపోతే నిద్రపోతాయి! మనిషిబ్రతుకే కష్టం. నేను ఇట్లా

మనిషిలాగా కాకుండా ఏ కుందేలు లాగానో పుడితే ఎంత బాగుండేది! చక్కగా అటూ ఇటూ గెంతుకుంటూ, తోటి కుందేళ్లతోఆడుకుంటూ, అడవిలో దుంపలన్నీ త్రవ్వుకుంటూ, దొరికిన పండునల్లా రుచిచూసుకుంటూ..ఓహ్! భలే ఉండేది!' అనుకున్నాడు.

అలా అనుకున్నాడో లేదో- వాడు అడవిలో కుందేలైపోయాడు! రాజు కుందేలుకు ఎంత ఉత్సాహం కలిగిందంటే చెప్పలేము. అటూ ఇటూ చెంగు చెంగుమని దూకి, గంతులు వేసి, బొర్లాడి- రకరకాలుగా పరుగులు పెట్టి చూసింది. దగ్గర్లోనే గెన్సుగడ్డల పొద ఒకటి కనబడింది. ఇంకేముంది?! రాజు కుందేలు కడుపారా చిలకడ దుంపలు మెక్కి, హాయిగా నిద్రపోయింది. అంతలో దానికి కుందేళ్ల గుంపొకటి కలిసింది. ఆ కుందేలు పిల్లలతో కలిసి ఇదీ కుందేలు ఆటలు ఆడింది. ఇట్లా ఎన్ని రోజులు గడిచాయో! కుందేలు పిల్ల లెక్కపెడితే గద!

అయితే అట్లా సంతోషంగా బ్రతుకుతున్న కుందేలు పిల్లను ఒకరోజున నక్క ఒకటి తరిమింది. దాన్నుండి తప్పించుకునేందుకు పాపం, రాజు కుందేలు చెమటలు క్రక్కుకుంటూప్రరుగుపెట్టాల్సి వచ్చింది. అట్లా పరుగెత్తుతుంటే దానికి ముళ్ళు గుచ్చుకొని పోయాయి; చర్మం చీరుకుపోయి రక్తం వచ్చింది. ఆ తర్వాతిరోజుకల్లా దానికి జ్వరం వచ్చేసింది. దగ్గర్లో ఒక్క డాక్టరు కూడా లేడాయె. కుందేలుకు పాపం నడిచేందుకు కూడా శక్తిలేక కూలబడిపోయింది.

"అబ్బ! ఈ కుందేలు బ్రతుకు కష్టమే. ఎప్పుడు నక్కలు వెంటబడతాయో చెప్పలేం. జ్వరం వస్తే..? ఇక చెప్పనవసరమే లేదు. అసలు ఈ జన్మ వద్దు నాకు. హాయిగా ఏ చెట్టు లాగానో ఉంటే ఎంత బాగుంటుంది! అసలు కదలాల్సిన పనే లేకుండా, గాలికి చక్కగా కొమ్మల్ని ఊపుకుంటూ, అందరికీ మేలు చేసే ఆక్సిజనును అందిస్తూ..భలే ఉంటుంది. బ్రతికితే చెట్టు లాగా బ్రతకాలి." అనుకున్నది రాజు కుందేలు.

అట్లా అనుకున్నదో లేదో- ఇట్లా అది

చెట్టయిపోయింది!

రాజు చెట్టు సంతోషంగా ఊగింది. కొమ్మల్ని అటూ ఇటూ తిప్పింది. దానిమీదికి పక్షులు వచ్చి గూళ్ళు కట్టుకుంటే మురిపెంగా చూసింది. పక్షి పిల్లలకు పండ్లు తినిపించింది. "జన్మంటే ఇదే! చెట్టు జన్మ ధన్యం. ఎప్పటికీ నేను చెట్టులాగానే ఉంటాను" అనుకున్నది.

అయినా ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. అనుకోకుండా వచ్చిన పెను తుఫాను దెబ్బకు రాజు చెట్టు కొమ్మలన్నీ విరిగిపోయాయి. మొండిదైపోయిన రాజు చెట్టు మళ్ళీ ఇగుర్లు వేద్దామనుకునేలోపల, కట్టెలు కొట్టేవాళ్ళు కొందరు దాని ముందు నిలబడి ఆ మాను గురించీ, దానిలో ఉండే చేవ గురించీ మాట్లాడుకున్నారు!

"ఇలా కదలలేని పరిస్థితి దుర్భరం. నేను గాలిలో ఎగిరే పక్షినైతే ఎంత హాయిగా ఉందునో! ఎంత గాలి వీస్తే అంత గొప్పగా గింగిరాలు కొడతాను. స్వేచ్ఛాజీవితం పూర్తిగా నా సొంతం అవుతుంది" అనుకున్నది రాజు చెట్టు.

మరుక్షణం అది పంచవన్నెల రామచిలుక ఐపోయింది.

రాజు చిలక అటూ ఇటూ ఎగిరింది. సంతోష పడింది. తోటల్లో తిరిగింది. జామ పళ్ళూ, దానిమ్మ పళ్ళూ కొరికి తిన్నది. కోయిలతో సమానంగా కూసింది. తోటి పక్షులతో కలిసి ఆడింది. "ఇలా బాగుంది స్వేచ్ఛగా" అనుకున్నది.

అయినా ఎంతకాలం? ఒకరోజున అది పొలంలో జామచెట్టు మీద వాలేసరికి, ఆ చెట్టుమీదే రైతు పరచి ఉంచిన వలలో చిక్కుకున్నది. "అయ్యో మనిషిగా ఉంటే సరిపోయేదేమో, కనీసం ఇలాంటి కష్టాలు ఉండేవి కావు" అనుకున్నది.

అట్లా అనుకున్నదోలేదో- ఇట్లా మనిషైపోయింది మళ్ళీ.

ఆ సరికి రాజు జ్వరం తగ్గిపోయింది- కొంచెం నీరసంగా ఉందంతే. ఆ నీరసంలో మంచి కల వచ్చినట్లుంది- రేపటినుండీ మళ్ళీ అడవికి వెళ్ళి ఆడుకోవచ్చు!



గులాబి నేర్పిన పాఠం



రచన: A.గాయత్రి, 10 వతరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

నిరంజన్ అల్లరి పిల్లవాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు అవ్వటంతో వాడిని చాలా గారాబంగా పెంచారు. వాడు అడిగిన వస్తువునల్లా లేదనకుండా తెచ్చి ఇచ్చేవాళ్ళు. నిరంజన్ అంతరంగంలో నిజానికి ఒక మంచితనం ఉండేది; అయితే స్నేహితుల ప్రభావం వల్ల కావచ్చు, అతనికి జీవితంలో ఒక లక్ష్యం అంటూ ఏర్పడలేదు. కొడుకు అల్లరి చిల్లరగా తిరుగుతూ, డబ్బులు ఖర్చుచేయటం చూసి తల్లిదండ్రులు చాలా బాధ పడేవాళ్ళు.

ఒక రోజు నిరంజన్ బడినుండి ఇంటికి వస్తుంటే ఒక బండి ఎదురైంది. బండివాడు గులాబి మొక్కలు అమ్ముకుంటున్నాడు. ఒక్కో గులాబి అంటుకూ ఒక్కో పువ్వుంది.

వాటిలో ఒక గులాబి మొక్క నిరంజన్‌ను బాగా ఆకర్షించింది.

వాడు వెంటనే దాన్ని కొనేసి ఇంటికి తీసుకెళ్ళాడు. ఇంకా కాళ్ళు చేతులు కడుక్కోకనే, దానికోసం ఇంటి పెరడులో ఒక గుంత త్రవ్వి, దాన్ని నాటి నీళ్ళు పోశాడు. ఆనాటినుండీ వాడు రోజూ కొంతసేపు ఆ మొక్క దగ్గర కూర్చొని, దానికి నీళ్ళు పోయటం, ఎరువు తెచ్చి వెయ్యటం, దాని మొదలు దగ్గర కలుపు తీసేసి శుభ్రం చేయటం మొదలుపెట్టాడు.

నిరంజన్ వాళ్ళ అమ్మానాన్నలు వాడిలో వచ్చిన ఈ మార్పును శ్రద్ధగా గమనిస్తున్నారు.

చూస్తూండగానే ఆ గులాబీ మొక్కకు ఒక చిన్న గులాబీ పువ్వు పూచింది. దాన్ని చూడగానే నిరంజన్‌కు చాలా సంతోషం వేసింది. ఆ సంతోషాన్ని వాడు తన అమ్మానాన్నలతోనే కాదు, స్నేహితులతోటీ, చివరికి టీచర్లతోటీ కూడా పంచుకున్నాడు. వాడిని ఇష్టపడే టీచరు ఒకాయన నేరుగా ఇంటికే వచ్చాడు, దాన్ని చూసేందుకు!

ఆయన నిరంజన్ తల్లిదండ్రులను అభినందిస్తూ "నిరంజన్ గురించి మీరు ఇక ఏ బెంగా పెట్టుకోనక్కరలేదు. ఒక మొక్కను అంత జాగ్రత్తగా సంరక్షించి, అందులో ఆనందాన్ని చూడగలిగాడంటే, నిరంజన్ తన ఇష్టాన్ని గుర్తించినట్లే. ఒక మొక్కను పెంచాలంటే ఎంతో మనసు పెట్టాలి. ఆరోగ్యంగా నవ్వే ఈ గులాబి పువ్వు నిరంజన్ కృషి ఫలం. ఒకసారి తన కృషిలో సంతోషాన్ని చూడగల్గిన నిరంజన్, ఇకపైన చూడండి- ఎన్ని గులాబులు పూయిస్తాడో" అన్నాడు.

ఆయన మాటల్ని నిజం చేస్తూ నిరంజన్ ఆ తర్వాత ఎన్నో మొక్కలు నాటాడు . తోటపనిలో వాడికి ఏర్పడిన ఇష్టం, ఆపైన వాడి చదువుల్లోనూ ప్రతిఫలించింది!



తిక్కరాజు-వెర్రిమంత్రి

పెద్దకథ



కన్నడ జానపద కథ

మూలం: ఎ.కె.రామానుజన్, ఫోక్‌టేల్స్ ఫ్రం ఇండియా

తెలుగు అనుసరణ: నారాయణ

అనగా అనగా ఒక రాజ్యం ఉండేది. దాని ప్రజలు పాపం, మంచివాళ్ళే- కానీ రాజుకీ, మంత్రికీ మాత్రం తలతిక్క కొంచెం ఎక్కువగానే ఉండేది. వాళ్లకు అందరు రాజుల్లాగా రాజ్యాన్ని పరిపాలించటం అంటే అస్సలు ఇష్టంలేదు. అందుకని, ఏదైనా ప్రత్యేకత ఉండాలని, వాళ్ళొక శాసనం చేసారు- పగలును రాత్రిగాను, రాత్రిని పగలుగాను నిర్ణయించారు: "రాజ్యంలో ప్రతివాళ్ళూ చీకట్లో పని చెయ్యాలి; తెల్లవారాక పడుకోవాలి. ఎవరైతే ఈ ఆజ్ఞల్ని ఉల్లంఘిస్తారో, వాళ్లకు మరణ దండన!"

ఇక ప్రజలు ఏం చేస్తారు? రాజుగారు ఎట్లా చెబితే అట్లా చేయక తప్పలేదు. తమ ఆజ్ఞలు చక్కగా అమలౌతున్నందుకు రాజుగారు, మంత్రిగారు మాత్రం చాలా సంతోషపడ్డారు.

ఒకరోజున తన శిష్యుడితో పాటు ఆ

రాజ్యానికి వచ్చాడు, మహిమాన్వితుడైన ఒక గురువు. మధ్యాహ్నం అవుతున్నది; నగరం చాలా అందంగా ఉన్నది. కానీ అటూ ఇటూ తిరుగుతూ మనుషులు కాదుగదా, ఒక్క ఎలుకకూడా కనబడలేదు వాళ్ళకు. అందరూ తలుపులు బిగించుకొని నిద్రపోతున్నారాయె! రాజాజ్ఞకు భయపడే ప్రజలు చివరికి ఆ రాజ్యంలో పశువులకు కూడా పగటి నిద్ర అలవాటు చేసేశారు! గురు శిష్యులిద్దరికీ చాలా ఆశ్చర్యం వేసింది.

అయితే సాయంత్రం అయ్యేసరికి, నగరమంతా ఒక్కసారిగా మేల్కొన్నది. ప్రజలంతా ఎవరిపనులు వాళ్ళు చకచకా చేసుకోవటం మొదలుపెట్టారు! గురుశిష్యులకు వాళ్ళ విధేయత చూస్తే ముచ్చట వేసింది.

చీకటి పడుతుండగా వాళ్ళిద్దరికీ బాగా ఆకలి వేసింది. దుకాణాలు తెరిచారు గనక, వెళ్ళి ఏమైనా భోజన సామగ్రి కొని తెచ్చుకుందామని బజారుకు వెళ్ళారిద్దరూ. చూస్తే ఆశ్చర్యం- అన్ని సామాన్లదీ ఒకే రేటు! ఒక్కోటీ ఒక్కో 'దుడ్డు'- అంతే. సోలెడు బియ్యమూ అంతే, డజను అరటి పళ్లూ అంతే. శిష్యుడు భోజన ప్రియుడు. అతను ఆ ధరల్ని చూసి చాలా సంతోషపడ్డాడు. ఎన్ని సామాన్లు కొనుక్కున్నా నిండా పది దుడ్లు కూడా ఖర్చవ్వలేదు మరి!


"ఇది పిచ్చివాళ్ల రాజ్యం నాయనా. ఇలాంటి చోట ఉండటం ప్రమాదం. వేరే ఎక్కడికైనా పోదాం, త్వరగా. పోదాం పద, ఇక్కడ ఉండకూడదు" అన్నారు గురువుగారు శిష్యుడితో, మెల్లగా. శిష్యుడికి మాత్రం ఆ రాజ్యం స్వర్గాన్ని తలపించింది. పారిపోయేందుకు తగిన కారణం ఏదీ కనబడలేదు. "ఇక్కడున్నన్ని తిండి పదార్థాలు మనకు ఈ ధరల్లో వేరే ఎక్కడా దొరకవు. ఎంత అద్భుతమైన ప్రదేశం,ఇది! ఇక్కడే ఉండిపోదాం మనం" అన్నాడు వాడు. "ఇది ఎక్కువకాలం నడవదు నాయనా. అదీగాక వీళ్ళు నిన్ను -ఎప్పుడు- ఏం-చేస్తారో ఎవ్వరికీ-తెలీదు- నా మాట విని, నాతో వచ్చేయి, ఇద్దరం వేరే ఎక్కడికైనా పోదాం" అని నచ్చ చెప్ప చూశారు గురువుగారు. కానీ శిష్యుడు ఒప్పుకోలేదు. ఆ రాజ్య వైభవం ముందు గురువుగారి

మంచిమాటలు తెలవెలబోయాయి. "ఏమైనా సరే! తను ఈ స్వర్గాన్ని వదిలి రాను" అన్నాడు శిష్యుడు. చేసేది లేక గురువుగారు అతన్ని అక్కడే వదిలి, "నీకు అవసరమైనప్పుడు పిలువు, వస్తాను" అని చెప్పి వెళ్ళారు.

శిష్యుడు మాత్రం అక్కడే ఉండిపోయాడు. సంతోషంగా రోజూ అరటిపళ్ళు, నెయ్యి, తేనె, అన్నం, గోధుమరొట్టెలు- ఇట్లా ఏవిపడితే అవి మెక్కి, అచ్చోసిన ఆంబోతు మాదిరి- గుండ్రంగా, నున్నగా, బలంగా తయారయ్యాడు.

అతను ఏమాత్రం ఊహించని సంఘటనల గొలుసొకటి అప్పుడే తయారవ్వటం మొదలు పెట్టింది-

ఆ నగరంలో ఉన్న ఒక ధనిక వ్యాపారి ఇంట్లోకి ఒకనాడు ఒక దొంగ జొరబడ్డాడు. మామూలుగా కాదు; వ్యాపారి ఇంటి గోడకు కన్నం వేసి, ఆ కన్నంలోంచి లోనికి దూరాడు. లోపల ఉన్న విలువైన వస్తువుల్ని మూటగట్టుకొని, ఇక బయటపడదామనుకునేలోపల, వాడు కన్నం వేసిన గోడ నిలువునా కూలింది! వాడు తను త్రవ్విన గోడక్రింద తానే పడి చచ్చిపోయాడు.



అయితే ఆ దొంగ తమ్ముడు రాజుగారి దగ్గరికి పోయి వ్యాపారి మీద ఫిర్యాదు చేశాడు-"ప్రభూ! మా అన్న తన కులవృత్తిని సజావుగా నిర్వర్తిస్తుండగా ఒక గోడ అతనిమీద కూలి అతని ప్రాణాల్ని నిలువునా తీసింది. దానికి కారణం ఈ వ్యాపారే. అతను గోడను బలంగా, దృఢంగా కట్టి ఉంటే మా అన్నకు ఇలాంటి గతి పట్టేది కాదు. తమరు ధర్మమూర్తులు- దోషిని కఠినంగా శిక్షించి, మా అన్న కుటుంబానికి న్యాయం చెయ్యాలి" అని.

రాజుగారు వాడికి "న్యాయమే గెలుస్తుంది" అని భరోసా ఇచ్చి, వ్యాపారిని పిలువనంపాడు.

వ్యాపారి రాగానే ప్రశ్నల వాన మొదలైంది: "నీ పేరు?"

"వరహాల శెట్టి, ప్రభూ!"

"చచ్చిపోయిన ఆ వ్యక్తి మీ ఇంటిని దోచుకునేందుకు వచ్చినప్పుడు నువ్వు అక్కడే ఉన్నావా?"

"మా ఇంట్లోనే ఉన్నాను మహారాజా! వాడు గోడకు కన్నం వేసి ఇంట్లోకి దూరాడు. గోడ బలహీనంగా ఉంది. అది వాడి మీదనే కూలింది."

"దోషి తన నేరాన్ని ఒప్పుకున్నాడు. దోషి కట్టిన గోడ ఒక వ్యక్తి ప్రాణాలను హరించింది. దీనికి పూర్తి బాధ్యత దోషిదే. మేం నీకు తగిన దండన విధిస్తాం, వరహాల శెట్టీ!"

"కానీ మహారాజా.." అన్నాడు వరహాల శెట్టి, "కథ ఇలా అడ్డం తిరిగిందేమి?" అని ఆశ్చర్యపోతూ.

"కానీ-గీనీ ఏమీ లేదు. నేరం చేసినవాడికి శిక్ష పడవలసిందే" అన్నాడు రాజు, గంభీరంగా.

తన ప్రాణాలకు ఎసరు పెట్టారన్న తర్వాత వరహాల శెట్టి మెదడు చురుకుగా పని చేసింది. "ఒక్క క్షణం ఆగండి మహారాజా! నిజానికి ఆ గోడను కట్టింది నేను కాదు. గోడను కట్టిన మేస్త్రీదే అసలు తప్పు. అతను దానిని గట్టిగా కట్టి ఉండాల్సింది; అతని నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలైపోయింది. మీరు అతన్ని శిక్షించాలి, మహాప్రభూ!" అన్నాడు శెట్టి.

"గోడను కట్టిన మేస్త్రీ ఎవరు?" అడిగారు రాజుగారు.

"ప్రభూ! ఆ యింటిని మా నాన్నగారి హయాములో కట్టారు. అప్పుడు మా యింటి గోడ కట్టిన మేస్త్రీ ఇప్పుడు ముసలివాడయ్యాడు. నాకు బాగా తెలుసు అతను. ఇక్కడికి దగ్గర్లోనే ఉంటాడు" అన్నాడు వరహాల శెట్టి, ఊపిరి పీల్చుకుంటూ.

మేస్త్రీని పిలుచుకురమ్మని సేవకులను పంపారు రాజుగారు, వరహాల శెట్టిని క్షమించి వదిలేస్తూ. కొద్దిసేపటికి మేస్త్రీ వచ్చి నిలబడ్డాడు.

"ఏమయ్యా, వరహాల శెట్టి తండ్రి బ్రతికున్న కాలంలో వాళ్ళ ఇంటి గోడను కట్టావట నువ్వు- నిజమేనా?"

"అవును ప్రభూ!"

"ఇట్లాంటి గోడనా, కట్టేది? అది ఒక పేద దొంగ మీద కూలి, వాడి ప్రాణాలనే హరించింది. నువ్వే ఈ హత్య చేసినట్లు రుజువైంది గనక, మేం నీకు మరణ దండన విధించాలి ఇప్పుడు!"



రాజుగారు తొందరపడి తనకు మరణదండన విధించేలోగా మేస్త్రీ తెలివి మేల్కొన్నది. అతను గట్టిగా వాదించాడు-"ప్రభూ! నన్ను శిక్షించేముందు నా మొరను ఒకసారి ఆలకించండి. నేను ఈ గోడను కట్టిన మాట వాస్తవం. అది బాగా కట్టలేదన్నదీ వాస్తవమే. అయితే అది అలా ఎందుకు తయారైందో కూడా చూడాలి తమరు. ఆ సమయంలో నా మనసు మనసులోలేదు. నాకు ఇంకా గుర్తున్నది- నేను గోడను కడుతూ ఉన్న సమయంలో ఒక నర్తకి, తన కాలి అందెల్ని, చేతి గాజుల్నీ గలగలలాడించుకుంటూ అటూ-ఇటూ తిరుగుతూనే ఉన్నది, రోజంతా. దాంతోనా మనసు వశం తప్పింది. నా చూపు ఇక నేను కడుతున్న గోడ మీద నిలవలేదు. మీరు ఆ నర్తకిని కఠినంగా శిక్షించాలి. ఆమె ఇల్లు తెలుసు, నాకు" అన్నాడు మేస్త్రీ.

"ఊఁ, నాకు తెలుసు.. కథ లోతు పెరుగుతున్నది. దీన్ని పూర్తిగా పరిశోధించకుండా వదిలేందుకు వీలు లేదు. ఆ నర్తకిని ఇటు పిలుచుకు రండి- ఆమె ఎక్కడున్నా సరే" అన్నారు రాజుగారు.

ఇప్పుడు ఆ నర్తకి ముసలిది అయ్యింది- ఆమె వణుక్కుంటూ వచ్చి నిలబడ్డది.

"పాపం, ఈ మనిషి అక్కడ కూర్చొని గోడ కడుతున్నప్పుడు, నువ్వు గాజులు, అందెలు గలగలలాడించుకుంటూ వీధిలో అటూ-ఇటూ తిరిగావా- నువ్వు వయసులో ఉన్నప్పుడు ఒకరోజున?" అడిగారు రాజుగారు.

"నిజమే మహారాజా, తిరిగాను" ఒప్పుకున్నదామె.

"అయితే నువ్వే దోషివన్నమాట. గాజులు,

అందెలు గలగలలాడిం, నువ్వు వాడి ఏకాగ్రతను దెబ్బ తీసావు. దాంతో వాడు కట్టే గోడ పాడైంది. అది ఒక పేదవాడి మీద కూలి, వాడి ప్రాణం తీసింది. నీ మూలంగా ఒక అమాయక ప్రాణి బలైంది- నీకు శిక్ష తప్పదు."

ఆమె ఒక్క క్షణం ఆలోచించి అన్నది- "మహారాజా! ఆగండి. నేను ఆరోజున అట్లా రోడ్డు మీద అటూ ఇటూ ఎందుకు తిరిగానో గుర్తుకు వచ్చింది. ఇదంతా ఆ కంసాలి చేసిన పని! నేనూ అతనికి కొన్ని బంగారు నగలు చేయమని డబ్బులిచ్చాను. అతను వాటిని 'ఇప్పుడిస్తాను-ఇప్పుడిస్తాను' అంటూ ఆ రోజంతా త్రిప్పుతూనే ఉన్నాడు. అతని వల్ల నేను ఆ రోజు కనీసం ఒక డజనుసార్లు అటూ ఇటూ తిరిగి ఉంటాను. అది నా తప్పు కాదు ప్రభూ! అదంతా ఆ నీచుడు, కంసాలి చేసిన తప్పు!" అని.

"పాపం, నిజంగానే ఈమెది ఏ తప్పూలేదు" అనుకున్నాడు రాజుగారు, అందిన సాక్ష్యాధారాలను పరిశీలిస్తూ. "అసలు నేరస్తుడు ఇప్పుడు దొరికాడు- పోండి! పోయి ఆ కంసాలిని ఇటు ఈడ్చుకొని రండి!" అని సైనికులను ఆజ్ఞాపించాడు.

సైనికులు పరుగున వెళ్ళేసరికి కంసాలి తన దుకాణంలో ఒక మూలన నక్కి కూర్చొని ఉన్నాడు. తన మీద వచ్చిన ఆరోపణలు వినగానే,అతను కూడా తన కథ వినిపించాడు-

"ప్రభూ! నేనొక పేద కంసాలిని. ఈ నర్తకిని నేను నా దుకాణం చుట్టూ అనేక సార్లు తిప్పించుకున్న మాట నిజమే. అయితే నేను ఆమెకి అలా సాకులు చెప్పటానికి ఒక కారణం ఉంది- నామీద ఒక ధనిక వర్తకుడు చాలా ఒత్తిడి తెచ్చాడు. ఆ ధనిక వర్తకుడి ఇంట్లో పెండ్లి ఉండింది, ఆ సమయంలో. ఆయన తన నగల్నే ముందుగా చేసి ఇవ్వాలని నన్ను బలవంత పెట్టాడు. ధనికులు ఎంత గట్టిగా మాట్లాడతారో మీకు తెలియని సంగతి కాదు గదా! ఆయన వల్లనే, నేను ఈమెకు నగల్ని అందివ్వటంలో జాప్యం అయ్యింది."

"ఎవడా ధనిక వర్తకుడు?! ధనబలంతో, తన నగల్ని ముందు చేయించుకొని, ఈ పేద నర్తకిని అన్నిసార్లు దుకాణం ముందు వీధిలో తిరిగేలా

చేసిన ఆ కరకు వాడెవ్వడు? వాడి మూలంగానే మేస్త్రీ మనసు వశం తప్పింది. అతని వల్లనే గోడ సరిగ్గా కట్టబడలేదు. అతని వల్లనే ఆ గోడ విరిగి, ఒక మామూలు దొంగమీదికి విరిగి పడి, వాడి ప్రాణం తీసింది. దీనికంతకూ కారణమైన ఆ ధనిక వర్తకుడు ఎవ్వడు?" అని అడిగాడు రాజుగారు, ఆవేశంగా.

"ఆ పని చేసింది ఈ వరహాల శెట్టిగారి తండ్రే ప్రభూ!" అన్నాడు కంసాలి చల్లగా.

"ఓహో! న్యాయం తిరిగి తిరిగి చేరాల్సిన ఇంటికే తిరిగి చేరిందన్నమాట! పిలిపించండి, వాడిని!" ఆజ్ఞాపించారు రాజుగారు.

"మానాన్నగారిని ఇప్పుడు పిలిపించలేము ప్రభూ! అయన చనిపోయి చాలా కాలమే అయ్యింది" అన్నాడు వరహాల శెట్టి.

"అయితే ఆ శిక్షను నువ్వు అనుభవించు" అన్నారు రాజుగారు, మంత్రిని సంప్రతించి."నీ తండ్రి హంతకుడు అని రుజువైంది. అతన్ని న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన బాధ్యత నీదే. అతను చనిపోయాడంటున్నావు. నిజమే కావచ్చు. అయినా, అతని బదులు వేరే ఎవరో ఒకరు శిక్షను అనుభవించకపోతే ఎలాగ?



హంతకుడైన నీ తండ్రినుండి నీకు ఆస్తిపాస్తులన్నీ సంక్రమించాయి- వాటితోబాటు అతని నేరాలు కూడానూ! నువ్వు ఆ నేరాలనుండి ఊరికే తప్పించుకొని పోలేవు. నిన్ను మొదటిసారి చూసినప్పుడే అనుకున్నాను- ఈ ఘోరనేరం వెనక ఉన్న అసలు సూత్రధారి నువ్వే అయిఉంటావని. నా ఊహ నిజమైంది- నీకిక జీవించే అర్హత లేదు. మేం నీకు మరణ దండన విధిస్తున్నాం!!"

వర్తకుడిని వధించటం కోసం కొత్త వధ్యశిలను ఒకదాన్ని సిద్ధం చేయమని ఆజ్ఞాపించారు రాజుగారు. ఒకవైపున కటికవాళ్ళు అలాంటి శిలను ఒకదాన్ని సిద్ధంచేసి, శిక్షను అమలు చేసేందుకు కత్తులు నూరుకుంటుండగా,

మంత్రిగారికి ఒక అనుమానం వచ్చింది- "ఈ శిల పెద్దది. దీని నిడివి ఎక్కువ. చూడగా వ్యాపారి మెడ సన్నం! ఇంత సన్నగా ఉండే మెడ, వధ్యశిలలో సరిగ్గా ఇమడదు గదా, మరెట్లా?" అని. మంత్రి తన అనుమానాన్ని దాచుకోకుండా రాజుగారి దగ్గర ప్రస్తావించాడు.

"తను ఈ సంగతిని ముందే ఎందుకు గమనించలేదు?" అని రాజుగారికి చాలా సిగ్గు వేసింది. "మరేం చేద్దాం?" అని అయన మంత్రినే అడిగారు, మంత్రిగారి ముందుచూపును ప్రశంసిస్తూ. అయితే అదే సమయంలోఆయనకు ఒక ఉపాయం తోచింది- "ఇతని తల శిలలో పట్టకపోతే మాత్రం నష్టం ఏముంది? శిక్షను ఎలాగైనా అమలు చేయవలసిందే. వీడి బదులు, లావుపాటి మెడ ఉండేవాడిని ఎవరినైనా వెతికి ఎంపిక చేసుకుంటే సరిపోతుంది!"అని. మంత్రిగారికి ఈ సలహా బాగా నచ్చింది. వెంటనే సైనికులు ఊరంతా వెతకటం మొదలుపెట్టారు- వధ్యశిలలో పట్టేంత పెద్ద మెడ ఉన్న, లావుపాటి మనుషులకోసం. అలా వెతుకుతున్న సైనికుల చూపు సంతోషంగా అటూ ఇటూ తిరుగుతున్న శిష్యుడిమీద పడింది- అతను నెలల తరబడి అరటిపళ్లు, నెయ్యి, తేనె, అన్నం, గోధుమ రొట్టెలు తినీ తినీ బాగా క్రొవ్వు పట్టి ఉన్నాడు మరి! సైనికులు తన మీదికి దూకి పెడరెక్కలు విరిచి పట్టుకోగానే శిష్యుడు గింజుకున్నాడు.

"నేనేం తప్పు చేశాను? నేను నిరపరాధిని. సన్యాసిని!" అని మొత్తుకున్నాడతను.

"కావచ్చు- కానీ, వధ్య శిలకు సరిపోయేంత మెడ ఉన్నవాడిని పట్టుకు రమ్మని రాజాజ్ఞ" అని, సైనికులు శిష్యుడిని శిరచ్ఛేదం కోసం తీసుకుపోయారు!

అప్పటికి గానీ తన గురువుగారి హెచ్చరికలోని మర్మం అర్థం కాలేదు శిష్యుడికి. " 'ఇది పిచ్చోళ్ళ రాజ్యం. ఇలాంటి చోట ఉండటం ప్రమాదం' అని తనకి చిలక్కి చెప్పినట్లు చెప్పారే, అయినా తను వినలేదు. దీన్నే స్వర్గం అనుకున్నాడు. ఇప్పుడు ఏం జరుగుతున్నదోచూడు!" అని అతనికి ఏడుపు వచ్చింది. "ఇక వేరే దారేదీ లేదు, దేవుడా! ఈ ఒక్కసారీ అవకాశం ఇవ్వు. మరెప్పుడూ

గురువుగారి మాటను జవదాటను" అని అతను మౌనంగా ప్రార్థన మొదలుపెట్టుకున్నాడు.



దేవుడు ఆ ప్రార్థనను నేరుగా గురువుగారికే చేర్చాడు- అద్భుత శక్తులున్న ఆయన, తక్షణం శిష్యుడిముందు ప్రత్యక్షమయ్యాడు. శిష్యుడిని తక్కువ మాటల్లోనే మెత్తగా చీవాట్లు పెట్టి, ఎవ్వరూ వినకుండా ఏదో చెప్పాడు. ఆ పైన రాజుగారి దగ్గరికి వెళ్ళి, ధైర్యంగా అడిగాడు- " రాజా! గురువు ఎక్కువా? శిష్యుడు ఎక్కువా?" అని.

"గురువే ఎక్కువ. సందేహం లేదు. అయినా నన్నెందుకు అడుగుతున్నారు?" అన్నారు రాజుగారు.

"అయితే నా శిష్యుడికంటే ముందు నాకు శిరచ్ఛేదం చెయ్యండి. నా తర్వాతగానీ వాడి తల తీసేందుకు వీలు లేదు" అన్నాడు గురువు.

సంగతి అర్థమై శిష్యుడు అక్కడినుండే అరవటం మొదలుపెట్టాడు- "నేను ముందు! మీరు ముందు నన్ను కదా, ఇక్కడికి తెచ్చింది? నా మెడే కదా, వధ్యశిలలో పట్టేది? అందుకని ముందు నన్నే వధించాలి. ఆయన్ని కాదు. ఆయనకు చెప్పండి, ఇక్కడినుండి వెళ్ళిపొమ్మనండి ముందు!" అని.

రాజుగారు, మంత్రిగారు నోళ్లప్పగించి చూస్తుండగానే గురు-శిష్యులమధ్య పోట్లాట మొదలైంది. "నేను ముందు! నేను ముందు!" అని. రాజుగారికి, మంత్రిగారికీ వాళ్ల ఈ ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. రాజుగారు గురువుని అడిగారు- "మీరెందుకు, చనిపోవాలని తొందరపడుతున్నారు? వధ్యశిలకు సరిపోయేంత మెడ ఉన్నది గనక మేం అతనిని ఎంపిక చేసుకున్నాం" అని.

"మీరు నన్ను ఎలాంటి ప్రశ్నలూ అడక్కండి. ముందుగా నన్ను వధించాలి- అంతే" అన్నాడు

గురువు, మొండిగా.

"ఎందుకు? ఇందులో ఏదో రహస్యం ఉంది. మీరేదో దాస్తున్నారు. జ్ఞానిగా మీకు తెలిసినదానిని మాబోటి వాళ్ళకు వివరించటం మీ బాధ్యత. చెప్పండి" అన్నారు రాజుగారు.

"నేను చెబితే మీరు నన్నే వధించాలి ముందు- మాట ఇస్తారా?" అడిగాడు గురువు.

రాజుగారు సరేనన్న మీదట, ఆయన రాజును దూరంగా తీసుకెళ్ళి, సేవకులెవ్వరికీ వినబడకుండా, గుసగుసగా చెప్పాడు- "మేమిద్దరమూ ఇప్పుడే, ఇక్కడే చచ్చిపోవాలని ఎందుకంత పంతం పడుతున్నామో ఇంకా అర్థం కాలేదా, మీకు? మేమిద్దరమూ అనేక దేశాలు తిరిగాం. ఈ భూమిమీద నిజానికి మేం చూడని ప్రదేశమే లేదు- కానీ ఇంతవరకూ మాకు మీ రాజ్యంలాంటి రాజ్యంగాని, మీలాంటి రాజుగారు గానీ ఎక్కడా కనబడలేదు. ఇప్పుడు మీ ముందున్న వధ్యశిల మామూలుది కాదు- సాక్షాత్తూ ఆ యమధర్మరాజు ఇష్టపడే శిల అది. పైగా కొత్తది! దానిమీద ఇంతవరకూఎలాంటి నేరమూ మోపబడి లేదు! అలాంటి ఈ శిల మీద మొదట మరణించే వాడి భాగ్యం ఏమని చెప్పేది? వాడు ఈరాజ్యానికి రాజుగా పునర్జన్మనొందుతాడు. దీనిమీద మరణించే రెండో వ్యక్తి ఈ రాజ్యానికి మహామంత్రిగా తిరిగి జన్మిస్తాడు. మాకు ఈ సన్యాస జీవితం అంటే వెగటు పుట్టింది. కొంతకాలంపాటు రాజుగాను, మంత్రిగాను జీవిస్తే బాగుండునని ఉన్నది. ఇప్పుడు ఇక మీరు మీ మాటను నిలబెట్టుకోండి మహారాజా! మమ్మల్ని వధించండి! నేనుముందు! గుర్తుంచుకోండి!"

రాజుగారు తీవ్రంగా ఆలోచించసాగారు. 'నా రాజ్యం ఇంకొకరి చేతిలో పడితే ఎలా?' అని ఆయనకు చింత పట్టుకున్నది. "ఏది ఏమైనా ఈ సమస్య చిన్నది కాదు. కొంచెం జాగ్రత్తగా ఆలోచించిగానీ నిర్ణయం తీసుకునేందుకు లేదు" అని, ఆయన వెంటనే శిష్యుడి శిక్షను వాయిదా వేసేశాడు. ఆపైన మంత్రితో రహస్య మంతనాలు జరిపాడు-"వచ్చే జన్మలోకూడా మన రాజ్యం మన చేతుల్లోనే ఉండేటట్లు చూసుకోవాలి. వీళ్ల బదులు మనమే

వధ్యశిలనెక్కితే ఎలా ఉంటుందంటావు, -వచ్చే జన్మలో కూడా రాజ్యం మనదే అవుతుంది?" అని.



మంత్రికి కూడా ఆ ఆలోచన సరైనదిగా తోచింది. "శిక్షను అమలు చేసే తలారులు మనల్ని గుర్తించారంటే పని చెడుతుంది. మనల్ని వధించేందుకు వాళ్ళకు చేతులు రావు. అందుకని, మనం ఈ గురుశిష్యుల్నిద్దరినీ వదిలేసి, వాళ్ల మాదిరే బట్టలు వేసుకొని పోయి కూర్చుందాం. ఏమంటారు, ప్రభువులు?" అన్నాడు మంత్రి.

ఇద్దరూ కూడ బలుక్కొని, తలారులను పిలిచి, "రాత్రికి రాత్రే శిక్ష అమలు జరపాలి. ముందుగా వచ్చిన వాడిని ముందు, తర్వాత వచ్చిన వాడిని తర్వాత వధించండి- తప్పు చేస్తే, జాగ్రత్త. మాకోసం ఎదురు చూడకండి" అని చెప్పేశారు. ఆపైన గురుశిష్యులిద్దర్నీ వదిలేసి, వాళ్ల స్థానంలో తాము కూర్చున్నారు. సంగతి తెలీని తలార్లు పాపం, వాళ్ల పని వాళ్ళు కానిచ్చేసారు. తర్వాత చూస్తే ఏముంది? నేరస్తుల శరీరాలకు బదులు, తమ రాజు, మంత్రుల శరీరాలు కనబడ్డాయి!

ఇక రాజ్యం అంతా అల్లకల్లోలమైంది. పెద్దలంతా కూర్చొని "రాజ్యం నడిచేదెలాగ? కొత్తరాజు ఎవ్వరు? కొత్తమంత్రి ఎవ్వరు?" అని చర్చలు జరిపారు. చివరికి, ఎవ్వరికీ తెలీకుండా రాజ్యం దాటి పోతున్న గురుశిష్యులిద్దర్నీ పట్టుకొని, "మీరే మా రాజు, మంత్రీ" అన్నారు వాళ్లంతా. శిష్యుడైతే వెంటనే ఒప్పేసుకున్నాడు గానీ, గురువుగారు మాత్రం అస్సలు ఒప్పుకోలేదు. చివరికి, "పాత

చట్టాలన్నిటినీ తొలగించచ్చు. పూర్తిగా కొత్త శాసనాలను అమలు చేయచ్చు" అని హామీ ఇచ్చాక, ఆయన తాత్కాలికంగా రాజ్యం నడిపేందుకు ఒప్పుకున్నాడు. ఆపైన రాజ్యంలో పగలు పగలూ, రాత్రి రాత్రీ అయిపోయాయి. కొంత కాలానికి ఆ రాజ్యానికీ, ఇతర రాజ్యాలకూ తేడా లేకుండా అయ్యింది!

జోకులు

చక్కని జంట!

పెళ్ళి కూతురు తల్లి: మా అమ్మాయి ఒట్టి పుస్తకాల పురుగండీ.

పెళ్ళి కొడుకు తండ్రి: ఫర్వాలేదులేండి, మా అబ్బాయిది పురుగు మందుల వ్యాపారమేగా!

ఏమీ మిగల్లేదు!

కొడుకు: నాన్నా! ఈ రోజుతో నా చదువు పూర్తయింది. అన్ని రకాల కోర్సులూ పూర్తి చేశాను.

తండ్రి: నా ఆస్తి కూడా పూర్తయింది. అన్ని రకాల అప్పులూ చేశాను.

ఇదొక్కటే చాలు!

షాపు యజమాని: మా స్వీట్ షాపులో పని చేయడానికి మీకున్న అర్హతలేంటి?

సుబ్బారావు: నాకు షుగర్ ఉంది సార్!



టీ!

సెప్టెంబరు నెల 'బొమ్మకు కథ'

రచన: నారాయణ, కొత్తపల్లి బృందం.

చాలా కాలం క్రితం విజన్యు అనే పట్టణంలో చాంగ్ అనే యువకుడొకడు ఉండేవాడు. వాడికి కూడా ఆనాటి యుద్ధవిద్యలన్నిటిలోనూ ప్రవేశం ఉండేది. అయితే వాడికి తన శక్తిసామర్ధ్యాలమీదా, తెలివి తేటల మీదా విపరీతమైన నమ్మకం ఉండటం చేత, అంత తొందరగా ఎవరిమాటా వినేవాడు కాదు.

ఒక సారి వాడికొక కల వచ్చింది. ఆ కలలో వాడు ఆ దేశపు యువరాణిని పెళ్ళాడాడు! ఆ తర్వాత యువరాణికి వాడొక బంగారు ఉంగరం తొడిగాడు. వాళ్ళిద్దరూ సంతోషంగా కొన్నేళ్ళు గడిపిన తర్వాత, యువరాణి ఎటో వెళ్లిపోయింది. అంతలోనే వాడికి మెలకువ వచ్చేసింది కూడాను! తీరా చూసుకుంటే యువరాణి లేదు!!

దాంతో వాడు కనిపించిన వాడికల్లా తన కష్టం చెప్పుకోవటం మొదలుపెట్టాడు. "యువరాణి తనను వరించటం మాత్రమే కాదు, తనతో

కాపురం కూడా చేసింది! అయితే ఆ తర్వాత తనిచ్చిన బంగారు ఉంగరంఎత్తుకెళ్లిపోయింది!"

"అయితే ఇకనేమి? రాజధానికి వెళ్ళు! అక్కడ మహల్లోఉంటుంది, నీభార్య. వెళ్తే కనీసం నీ ఉంగరం నీకు దక్కుతుంది" అన్నారు కొందరు, వెటకారంగా.

ఆలోచించగా అది సరైన సలహానే అనిపించింది వాడికి. అయితే విజన్యు నుండి రాజధాని చాలా దూరం! అంతదూరం నడిచి వెళ్లాలంటే కాళ్ళు నొప్పులు పుడతాయి. అంత శ్రమపడి తను వెళ్తే, 'యువరాణి కనీసం కాళ్లైనా వత్తుతుందో లేదో' అని అనుమానం కలిగింది వాడికి. 'దీనికంటే నయం, విజన్యులోనే ఉన్న రాజప్రతినిధిని గుర్రం సమకూర్చమంటే పోలేదూ?' అని, వాడు రాజ ప్రతినిధి దగ్గరికి వెళ్లాడు.

వాడు వెళ్లే సరికి రాజ ప్రతినిధి రకరకాల వివాదాల్ని పరిష్కరిస్తూ వ్యస్తంగా ఉన్నాడు. ఆయనముందు ఒక పెద్ద పుస్తకం- రాజ్య పరిపాలనా నియమావళి- శిక్షాస్మృతి తెరచి ఉంది. వరసల్లో నిలబడి ఆరేడుగురు న్యాయవేత్తలు ఆయన చెప్పేది శ్రద్ధగా వింటున్నారు. కొంచెం దూరంగా కూర్చొని రకరకాల కక్షిదారులు దస్తావేజులు తయారు చేసుకుంటున్నారు. ప్రక్కనే ఒక చిన్న బల్లమీద ఘుమఘుమలాడే టీ పాత్ర, కప్పులు పెట్టి ఉన్నై.



Chinese Mural Painting by **Peter Griffin**

చాంగ్ నేరుగా రాజ ప్రతినిధి దగ్గరికి వెళ్లి "ఇదిగో చూడండి! నేను చక్రవర్తిగారి అల్లుడిని. హడావిడిగా రాజధానికి వెళ్ళాల్సిన పని పడింది. మీరు నాకోసం మీదగ్గరున్న మంచి గుర్రాల్లో ఒకదాన్ని వెంటనే సిద్ధం చేయండి. ఆలోగా నేను ఇక్కడే నిలబడి టీ త్రాగుతుంటాను "అన్నాడు, టీ కప్పును చేతిలోకి తీసుకుంటూ.

రాజ ప్రతినిధి ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు:

"చక్రవర్తిగారి అల్లుడు! తన కార్యాలయానికి రావటమేమిటి!? అల్లుడుగారు తన పనితీరును అంతా గమనించేసి ఉంటారు. తన లోపాలన్నీఇప్పుడు ఇక చక్రవర్తిని చేరుకుంటాయి కాబోలు!" అని, ఆయన గబుక్కున లేచి నిలబడి, మిగతా వాళ్ళు ఏం చెప్తున్నదీ పట్టించుకోకుండానే చాంగ్ చేతులు పట్టుకొని, "అల్లుడుగారూ! తమరు నా యీ చిన్న ఊరిని సందర్శించ రావటం అద్భుతం! తమరి ఆజ్ఞను అమలు చేయటం నా ధర్మం. వెంటనే గుర్రాన్ని సిద్ధం చేస్తాను" అని, గబగబా గుర్రాన్నొకదాన్ని తెప్పించి, చాంగ్ ను స్వయంగా చెయ్యిపట్టుకొని గుర్రం ఎక్కించి పంపేసి, తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

చాంగ్ ఆ గుర్రాన్నెక్కి రాజధానికి చేరుకునేసరికి చాలా అలసిపోయి ఉన్నాడు. "ఎంత దూరం వచ్చింది, నా భార్య?! ఆమెకు ఎలాగైనా బుద్ధి చెప్పాలి. ఇప్పుడు ఇక్కడినుండి రమ్మన్నా వస్తుందో, రాదో" అనుకుంటూ వాడు అక్కడ ఒక టీ దుకాణం ముందు గుర్రాన్ని నిలిపాడు.

దుకాణంలో అవ్వ వాడికోసం టీ తయారు చేసి ఇస్తుండగా వాడు అమెను యువరాణి గురించి అడిగాడు. "ఏం చెప్పాలి నాయనా! ఆమె అసలు పెళ్లి చేసుకోనంటున్నది. చక్రవర్తి బ్రతిమాలగా బ్రతిమాలగా, నిన్ననే స్వయంవరానికి అంగీకరించిందట!" అన్నది అవ్వ.

"ఆఁ! అంత పని చేస్తున్నదా, నేనుండగానే!?" అని చాంగ్ ఉన్నపళాన లేచి, రాజభవనం చేరుకొని, నేరుగా లోనికి దూసుకెళ్ళాడు. అక్కడున్న సైనికులు వాడిని ఆపేవాళ్లేగానీ, వాడెక్కిన గుర్రాన్ని చూసి, వాడి ముఖంలో వ్యక్తమౌతున్న భావాల్ని చూసీ వాళ్లకు వాడిని ఆపేందుకు ధైర్యం చాలలేదు. వాడు రాకుమారి మందిరం ముందున్న గంటను కొట్టగానే సైనికులు వాడిని రాకుమారి ముందు ప్రవేశపెట్టారు.

"అంతా సరేగానీ, నువ్వు నన్ను వదిలి ఎందుకొచ్చేశావు? మళ్లీ స్వయంవరం ఏమిటి? చెప్పు, ముందు!?" అని వాడు రాకుమారిని నిలదీశాడు.

ఆ మాట వినగానే రాకుమారి కళ్లనీళ్ల పర్యంతం అయిపోయింది. జరిగిందేమిటంటే, ఆమె చిన్నపిల్లగా ఉండగా ముసలమ్మలంతా కలిసి , తోటి పిల్లవాడొకడితో బొమ్మల పెళ్లి జరిపించారు. ఒకవైపున ఆ పెళ్లి జరుగుతుండగానే పిల్లలిద్దరూ పోట్లాడుకున్నారు. కోపం కొద్దీ పిల్లవాడు పీటలమీదినుండి లేచి వెళ్లిపోయాడు! ఆ జ్ఞాపకాలు మనసులో పెట్టుకున్న రాకుమారి పెద్దైనా పెళ్లికి ఒప్పుకోవటం లేదు.

"'నువ్వు నువ్వే' అని నాకేంటి, గుర్తు?" అని అడిగిందామె, వాడిని.

"నీ చేతికున్న ఉంగరం నాదే గద!" అన్నాడు చాంగ్ కోపంగా.

"నీకూ నాకూ ఇష్టమయినది ఏంటి చెప్పు?" అన్నది రాకుమారి చివరి పరీక్షగా.

"ఊరికే నిలబెట్టి మాట్లాడుతున్నావు, కొంచెం టీ నీళ్లు తెచ్చిపోస్తే ఏమౌతుంది? నీకోసం ఎంతదూరం నుండి వచ్చాననుకున్నావు?" అని వాడు అనేసరికి, రాకుమారి సిగ్గులమొగ్గే అయ్యింది.

"కుమార్తె ఇన్నాళ్లకుగదా, ఎవరినో ఒకరిని ఇష్టపడింది?" అనుకున్న చక్రవర్తి వాళ్లిద్దరికీ ఘనంగా పెళ్లి జరిపించాడు.

"మాకు ఎప్పుడో పెళ్లైంది గదా, మళ్ళీ పెళ్ళేంటి?" అని చికాకు పడుతున్న చాంగ్ ను చూపులతోనే వారించింది యువరాణి.

అటు తర్వాత వాడికి రాజధాని బాగానే అనిపించింది.

తెలివి ! **జోకు**

మాస్టారు: సునీతా, ఎనిమిదిలో సగం ఎంత?


సునీత: అడ్డంగా కోస్తే సున్నా, నిలువుగా కోస్తే మూడు సార్!

దీపం



గానం: నాగప్రవల్లిక, 9 వ తరగతి, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.
రచన: శ్రీ వారణాసి వెంకట్రావుగారు, విజయవాడ.

దీపం... విజ్ఞాన చైతన్య రూపం(2)
శూన్యమైన - ఆకాశంలో- సూర్యుడె కాంతి దీపం!!(2)
మూఢుడైన- మానవునకు- విద్యే విజ్ఞాన దీపం(2)
విద్యే విజ్ఞాన దీపం
"దీపం..."



వేసవి ఎండల ఎండిన ఏటికి
మేఘమె ఆశా దీపం(2)
శిశిరాన మ్రోడైన తరువునకు
చిగురే చైతన్య దీపం(2)
చిగురే చైతన్య దీపం
"దీపం..."

కష్టము, సుఖము -కలసిన బ్రతుకున-
పాపలే ఆనంద దీపం!!(2)
మంచి, చెడులు సూచించు మనసే మనిషికి దివ్య దీపం(2)
మనిషికి దివ్య దీపం "దీపం..."

ఆడే పాడే పిల్లలం

రచన: శ్రీ వారణాసి వెంకట్రావు గారు, విజయవాడ.

గానం: కీర్తన, సరిగమ, అఖిల, 9 వ తరగతి, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.



ఆడే పాడే పిల్లలం!

అమ్మ,నాన్నల ఆశాజ్యోతులం!!(2)

భారతజాతి కేదారంలో

తొలకరి మొలచిన మొలకలం(2)

భావితరాల భాగ్యోదయానికి

వేకువ విసిరిన వెలుగు రేకలం(2)

"ఆడే పాడే పిల్లలం!"

కల్లాకపటం కాటువేయని-

తెల్లని మనసుల మల్లెలం!!(2)

ద్వేషాసూయలు జొరబడని-

దైవానికి ప్రతిరూపాలం(2)


"ఆడే పాడే పిల్లలం! "



వసంతకాలపు పువ్వులం

రచన: శ్రీ వారణాసి వెంకట్రావు గారు, విజయవాడ.

గానం: కీర్తన, సరిగమ, అఖిల, 9 వ తరగతి, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.



వసంతకాలపు పువ్వులం

వానా కాలపు చినుకులం

నవ్వీనవ్విస్తూ చిందులేస్తూ

నట్టింట తిరిగే పిల్లలం(2)

"వసంతకాలపు పువ్వులం"

వెనుక ముందు తరాల నడుమ

వెలిగే చిరు వేకువ రేకలం(2)

భవితవ్యపు బాటలలో

చీకటులను తొలగిస్తాం(2)

చీకటులను తొలగిస్తాం

"వసంతకాలపు పువ్వులం"



మహనీయులు మసలిన నేల-
మొలచినట్టి మొలకల మేము(2)
దేశ మాత ప్రగతి రథానికి
ఆశయాల పూలందిస్తాం(2)
ఆశయాల పూలందిస్తాం
"వసంతకాలపు పువ్వులం"

బాపూజీ చాచా నెహ్రూ
కలలుగన్న భరతావనిని(2)
సమత, మమత సందర్శించే
మానవతకు గుడిగా చేస్తాం(2)
మానవతకు గుడిగా చేస్తాం
"వసంతకాలపు పువ్వులం"

జోకులు

ఏంపని?

బ్రహ్మం: సడన్‌గా భగవంతుడు ప్రత్యక్షమైతే నువ్వేం అడుగుతావు?

వెంగళప్ప: 'నాతో ఏం పనుండి ప్రత్యక్షమయ్యారు స్వామీ?' అని అడగుతాను.

గుమ్మడికాయ దొంగ!

రవి: మాస్టారూ! భోజనం చేశారా?

మాస్టారు(చికాకుగా): నేనెందుకు చేస్తాను. మా ఆవిడ కదా, చేసేది?

గాలికబుర్లు!

తండ్రి; మీ కొత్త టీచర్ ఎలా చెబుతున్నారు రా?

కొడుకు: అన్నీ గాలికబుర్లే నాన్నా!

తండ్రి: అదేంట్రా, పాపం అట్లా అంటావు?


కొడుకు: నిన్న ఆక్సిజన్, మొన్న నైట్రోజన్..ఇవాళ్ళ హైడ్రోజన్.. మరింకేమనాలి?

జూ!

నిర్వహణ: G.లలిత, telugu4kids.com

చిత్రం: అనురాగ్‌గోదావరి, 5 వతరగతి.

క్రింది చిత్రాన్ని చూడండి. మీకేమనిపిస్తున్నది?



జంతు సంరక్షణ శాల- జూ! ఎన్నెన్నో జంతువులు! ఇలాంటి జంతుప్రపంచం మీ కళ్ళ ఎదురుగా ఉంటే, మనసులో కథలు తప్పకుండా మొదలౌతాయి. ఆ కథలకు అక్షర రూపం ఇవ్వండి. వీలైనంత తొందరగా మాకు పంపండి. బాగున్న కథలను కొత్తపల్లి పత్రిక జనవరి సంచికలో ప్రచురిస్తాం.

మా చిరునామా:

కొత్తపల్లి బృందం, 2-312, చెన్నేకొత్తపల్లి - 515 101, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

కొత్తపల్లి బృందం

సారధ్యం: సుబ్బరాజు

ప్రధాన సంపాదకులు: నారాయణ

సంపాదక వర్గం: మోహనయ్య, జయచంద్ర, మురళి.

సాంకేతిక బృందం: ఆనంద్, లక్ష్మి, లీల.

చిత్రాలు: వీరాంజనేయులు, అడవి, మారుతి.

ఈ మాసపు జోకులు: విష్ణు, చంద్ర.

ఆర్థిక వ్యవహారాలు: అలివేలమ్మ

చందా వివరాలు

సంవత్సర చందా: 200/ రూ.

చందాను 'కొత్తపల్లి ట్రస్టు' పేరిట మనీఆర్డర్ లేదా డి.డి లేదా చెక్కు రూపంలో కట్టవచ్చును. డి.డి., చెక్కులకు బ్యాంకు చార్జీలు (25రూ) కలపాలని మనవి.

చందాలకై చిరునామా:

కొత్తపల్లి ట్రస్టు,
2-312, న్యామద్దల రోడ్డు, చెన్నేకొత్తపల్లి,
అనంతపురంజిల్లా, 515101.

బ్యాంకు ద్వారా చందా కట్టడానికి వివరాలు:

KOTTAPALLI TRUST,
A/c No:0138101018809 (Savings Type),
CANARA BANK, Chennekottapalli,
Anantapur District, A.P.
IFSC code: CNRB0000138.

డబ్బు కట్టిన వివరాలను ఇమెయిలు/ ఫోను/ ఉత్తరం ద్వారా కొత్తపల్లికి తెలియపరచగలరు.

ఇమెయిలు: team@kottapalli.in
ఫోను: 08559 240222.

కృతజ్ఞతలు:

పత్రికకోసం నిరంతరంగా పిల్లల రచనల్ని అందించి సహకరిస్తున్న ప్రకృతిబడి, టింబక్టు బడి, విజ్ఞం స్కూల్ యాజమాన్యాలకు కృతజ్ఞతలు. వెబ్ సైటుకు వెన్నుదన్నుగా నిల్చిన infogami యాజమాన్యానికి, దాన్ని సుసాధ్యం చేసిన python భాషకు, చక్కని ఆపరేటింగ్ సిస్టం linux ను అందించిన ubuntu వారికి, గొప్ప వ్యవస్థని పూర్తిగా ఉచితంగా అందిస్తున్న OpenOffice వారికి, తెలుగును రప్పిస్తున్న Unicode, Scim, Baraha లకు, చిత్రాలను సరిదిద్దే Software Gimp నిర్మాతలకు, శబ్దాలను చక్కబరచే Software Audacity నిర్మాతలకు కృతజ్ఞతలు.

మంచి పుస్తకం:

పుప్పుజాన్ కథలు

